Visakha Samacharam
MINI FUNCTION HALL
100 Seating
Call : 93939 49345

VISAKHA SAMACHARAM TELUGU DAILY: VISAKHAPATNAM
Postal Registration No. VSP / 96/ 2024 - 26.
visit: www.visakhasamacharam.com

# విశాఖ సమాచారమ్




RNI No.52722/90 సంపుటి : 34 సంచిక : 296 విశాఖపట్నం, 13 సెప్టెంబరు 2024 శుక్రవారం E-mail : vspnews@gmail.com, పేజీలు : 8 వెల : రూ.2.00

## ఉద్యోగుల బదిలీలకు గడువుపెంచిన చంద్రబాబు



ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉద్యోగుల విషయంలో సీఎం చంద్రబాబు సానుకూలంగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే ఉద్యోగులకు సంబంధించిన పలు అంశాలపై పాజిటివ్ నిర్ణయాలు తీసుకుంటున్న చంద్రబాబు.. తాజాగా ఓ కీలక అంశంపై ఉత్తర్వులు ఇచ్చారు. రాష్ట్రంలో ఉద్యోగులు ఎప్పటినుంచో ఎదురుచూస్తున్న బదిలీలపై నిషేధం ఎత్తివేతపై ఉత్తర్వులు జారీ చేశారు. అయితే వీటిలో కొన్ని ఇబ్బందులు తలెత్తడంతో వాటిలో మరో మార్పు ప్రకటించారు.

రాష్ట్రంలో ఎక్సైజ్ శాఖ మినహా మిగిలిన శాఖల్లో ఉద్యోగుల బదిలీపై ఉన్న నిషేధాన్ని గత నెల 19 నుంచి 31 వరకూ ఎత్తేస్తూ గతంలో ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే పలు శాఖల్లో ఉద్యోగుల బదిలీలకు మార్గదర్శకాలు విడుదల చేయడంలో ఆలస్యం కావడంతో ఆ గడువును ఈ నెల మొదటివారానికి పెంచారు. రాష్ట్రంలో ఓవైపు వరద సహాయక చర్యల్లో ఉద్యోగులు ఉండటంతో మరోసారి ఉద్యోగుల బదిలీలపై ఇచ్చిన గడువును మరోసారి పొడిగించారు.

ఏపీలో ఎక్సైజ్ మినహా మిగిలి శాఖల్లో ఉద్యోగుల బదిలీలకు ఇచ్చిన గడువును ఈ నెల 22 వరకూ పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

(మిగతా 2లో)

## విశాఖను దేశంలోనే నెం.1 స్థానంలో నిలబెట్టాలి



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** సమ్మిళిత అభివృద్ధి విధానాలను అవలంభిస్తూ... యువ త ఉపాధికి, ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తూ... విశాఖపట్టణం జిల్లాను దేశంలోనే నెం.1 స్థానంలో నిలబెట్టాలని దీనికి ప్రజా ప్రతి నిధులు, అధికారులు అవిరళ కృషి చేయాలని విశాఖ ఎంపీ ఎం. శ్రీభరత్ పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి వాటి ద్వారా కలిగే ప్రయోజనాల గురించి ప్రజలకు వివ రించాలని, విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. పథకాల అమల కొరకు కేంద్రం నుంచి వస్తున్న నిధులను సమృద్ధిగా వినియోగించాలని, లబ్ధిదారులకు పూర్తి స్థాయిలో ఫలాలు అందేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. రాష్ట్ర పరిధిలో అమలవుతున్న కేంద్ర ప్రాయోజిత పథకాల తీరుతెన్నులు, సమస్యలు, ఎదురవుతున్న సవాళ్ళ, అధికారుల సమన్వయం తదితర అంశాలపై గురువారం కలెక్టరేట్ మీటింగు హాలులో జరిగిన దిశా (డిస్ట్రిక్ట్ డెవలప్మెంట్ కో-ఆర్డినేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ / జిల్లా స్థాయి అభివృద్ధి సమన్వయ మరియు మానటరింగ్ కమిటీ) సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని సమీక్షించారు.

ఈ క్రమంలో 29 విభాగాల పరిధిలో కేంద్రం అమలు చేస్తున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన, దీన్ దయాల్ అంత్యోదయ యోజన, ప్రధాన మంత్రి పసల్ భీమా యోజన, డిజిటల్ ఇండియా, నేషనల్ లైవ్ స్టాక్, గోకుల్ మిషన్, ప్రధాన మంత్రి మాతృవందన యోజన, నేషనల్ హెల్త్ మిషన్, జల జీవన్ మిషన్, పీఎం పోషణ్, ఖేలో ఇండియా, సంసద్ ఆదర్శ గ్రామ యోజన, ప్రధాన మంత్రి ఉజ్వల యోజన, ప్రధాన

(మిగతా 2లో)

## కమ్యూనిస్టు దిగ్గజం సీతారాం ఏచూరి కన్నుమూత

ప్రముఖ రాజకీయవేత్త, వామపక్ష యోధుడు, సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి (72) కన్నుమూశారు. ఊపిరితిత్తుల్లో ఇన్ఫెక్షన్తో ఢిల్లీ ఎయిమ్స్లో కొద్ది వారాలుగా చికిత్స పొందిన ఆయన ఆరోగ్యం విషమించడంతో తుదిశ్వాస విడిచారు. ఆర్థికవేత్త, సామాజిక కార్యకర్త, కాలమిస్టుగా గుర్తింపు పొందిన ఏచూరి.. 1992 నుంచి పార్టీ పొలిట్బ్యూరో సభ్యుడిగా ఉన్నారు. 2005 నుంచి 2017 వరకు రాజ్యసభ సభ్యుడిగా కొనసాగారు.

**బాల్యం హైదరాబాద్లోనే..**

సీతారాం ఏచూరి మద్రాస్ (ప్రస్తుతం చెన్నై)లో తెలుగు కుటుంబంలో 12 ఆగస్టు 1952న జన్మించారు. ఆయన తండ్రి సర్వేశ్వర సోమయాజుల ఏచూరి ఆంధ్రప్రదేశ్ స్టేట్ రోడ్ కార్పొరేషన్లో ఇంజినీర్. తల్లి కల్పకం ఏచూరి ప్రభుత్వ అధికారి. ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎస్ మోహన్ కందాకు మేనల్లుడు. ఏచూరి బాల్యం హైదరాబాద్లోనే గడిచింది. ఇక్కడి ఆల్ సెయింట్స్ హైస్కూల్లో మెట్రిక్యులేషన్ పూర్తి చేశారు. అనంతరం ఢిల్లీకి వెళ్లి ప్రెసిడెంట్స్ ఎస్టేట్ స్కూల్లో చేరారు. 1970లో సీబీఎస్సీ హయ్యర్ సెకండరీ పరీక్షలో ఆల్ ఇండియా ర్యాంకర్గా నిలిచారు. ప్రఖ్యాత సెయింట్ స్టీఫెన్స్ కాలేజీలో ఆర్థికశాస్త్రంలో బీఏ పూర్తి చేశారు. జేఎన్యూ నుంచి ఎంఏ పట్టా పొందారు. అక్కడే పీహెచ్డీలో చేరినా.. ఎమర్జెన్సీ సమయంలో అరెస్టు కావడంతో



దాన్ని కొనసాగించలేకపోయారు. సీతారాం మొదటి భార్య ఇంద్రాణి మజుందార్. జర్నలిస్టు సీమా చిశ్తీని రెండో వివాహం చేసుకున్నారు. ఆయనకు ముగ్గురు సంతానం.

**విద్యార్థి నేతగా రాజకీయాల్లోకి..**

ఎస్ఎఫ్ఐ విద్యార్థి నేతగా 1974లో సీతారాం ఏచూరి రాజకీయ ప్రస్థానం మొదలైంది. 1975లో జేఎన్యూ విద్యార్థిగా ఉన్నప్పుడు సీపీఎంలో చేరారు. ఎమర్జెన్సీ సమయంలో అరెస్టయిన వారిలో ఆయన కూడా ఒకరు. జేఎన్యూ స్టూడెంట్స్ యూనియన్కు మూడుసార్లు అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. సీపీఎం మాజీ ప్రధాన కార్యదర్శి ప్రకాశ్ కరాత్తో కలిసి జేఎన్యూను వామపక్ష కోటగా మార్చారు. ఎస్ఎఫ్ఐ ప్రధాన కార్యదర్శిగా, అధ్యక్షుడిగా పనిచేశారు. 1984లో సీపీఎం కేంద్ర కమిటీలో చేరారు. 1992లో పార్టీ పొలిట్బ్యూరో సభ్యుడిగా ఎన్నికయ్యారు. 2005లో పశ్చిమ బెంగాల్ నుంచి తొలిసారి రాజ్యసభకు ఎన్నికయ్యారు. 2015లో విశాఖపట్నంలో జరిగిన 21వ సీపీఎం మహాసభల్లో పార్టీ ఐదో ప్రధాన కార్యదర్శిగా

(మిగతా 2లో)

## ప్రకాశం బ్యారేజీ వద్ద ముమ్మరంగా బోట్ల వెలికితీత పనులు: మంత్రి నిమ్మల



**విజయవాడ:** ప్రకాశం బ్యారేజీ వద్ద అడ్డుపడిన బోట్లను వెలికితీసే పనులు ముమ్మరంగా సాగుతున్నాయని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. పడవ తొల గింపు పనులను ఆయన గురువారం పరిశీలించారు. డైవింగ్ టీమ్ నది లోపలకెళ్లి నిరంతరం బోటును కోస్తున్నారని చెప్పారు. పడవ దృఢంగా ఉండటం వల్ల కోత ఆలస్యమవుతోందని తెలిపారు. ఇప్పటివరకు ఒక బోటును 70 శాతం మేర కోశారని పేర్కొన్నారు. మరో 10 మీటర్ల వరకు కోయాల్సి ఉందని చెప్పారు. అది రెండు భాగాలయ్యాక బయటకు తరలించే పనులు ప్రారంభిస్తామని వివరించారు. కచ్చులూరులో గోదాట్లో మునిగిన బోటును తొలగించిన అబ్బులును రప్పిస్తున్నామన్నారు. కాసేపట్లో అబ్బులు టీమ్ వచ్చి బోట్లను బయటకు తీసే పని ప్రారంభిస్తుందని నిమ్మల రామానాయుడు చెప్పారు.

## గ్రేటర్ లోకి గ్రామీణం : గంటా శ్రీనివాసరావు



**భీమునిపట్నం, (విశాఖ సమాచారమ్):** భీమిలి నియోజకవర్గంలోని 64 పంచాయతీలు గల ఆనందపురం, పద్మనాభం, భీమిలి రూరల్ మండలాలు జీవీఎంసీలో విలీనానికి ప్రతిపాదించినట్టు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తెలిపారు. దీంతో భీమిలి నియోజకవర్గమంతా జీవీఎంసీ పరిధిలోకి రానుందని వెల్లడించారు. గురువారం ఆయన తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఆనందపురం మండలంలో 26, పద్మనాభం మండలంలో 22, భీమిలి రూరల్ లోని 16 పంచాయతీలు జీవీఎంసీలో కలపడంపై ఆయా ప్రాంతాల నాయకులు, ప్రజా ప్రతినిధులతో సమావేశమై వారి అభిప్రాయాలు కూడా తీసుకున్నానని వివరించారు. విలీనానికి వీరందరూ మద్దతు ప్రకటించిన తర్వాతే మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణకు లేఖ రాశానని చెప్పారు. 1.25 లక్షల ఓటర్లు, 2 లక్షల జనాభా గల ఈ ప్రాంతాలు విలీనం తర్వాత పదేళ్ల పాటు పన్నులు పెరగకుండా మినహాయింపు తీసుకుంటామని ప్రకటించారు. 2017లో తమ ప్రభుత్వ హయంలోనే కాపులుప్పాడ, చేపలుప్పాడ తదితర పంచాయతీల విలీనమై గ్రేటర్ మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పడిందన్నారు. మధురవాడ - భీమిలి పట్టణ ప్రాంతాలు జీవీఎంసీలో ఉండగా వీటి మధ్యలో ఉన్న ప్రాంతాలు పంచాయతీలలో ఉండడం వల్ల పాలనాపరమైన ఇబ్బందులు రాకుండా విలీన ప్రతిపాదన చేశామన్నారు. విలీనం తర్వాత ఎన్.ఆర్.ఈ.జి.ఎస్. ఉపాధి హామీ పథకం పనులు మరో ఏడాదిన్నర చేసుకునే అవకాశముందని పేర్కొన్నారు. 2026 మార్చి నాటికి ప్రారంభమయ్యే భోగాపురం గ్రీన్ ఫీల్డ్ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టుకు తగ్గ మౌలిక సౌకర్యాలు

(మిగతా 2లో)

## సాంకేతిక మరియు పారిశ్రామిక అభివృద్ధి అనేది పర్యావరణ హితంగా ఉండాలి

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** సాంకేతిక మరియు పారిశ్రామిక అభివృద్ధి అనేది పర్యావరణ హితంగా ఉండాలి అని ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య జి. శశిభూషణ రావు అన్నారు. ఎన్విరాన్మెంటల్, ఎకనామిక్ మరియు సోషల్ సస్టైనబుల్టి (ఇ.ఇ.ఎస్.ఎస్-2024) అనే అంసంపై మినిస్ట్రీ అఫ్ ఎం.ఎస్.ఎం.ఇ వారి సహకారం తో ఏయూ ఆ హబ్ అద్వర్యం లో నేటి నుండి రెండురోజుల పటు ఆంధ్ర విశ్వ విద్యాలయంలో జరగనున్న అంతర్జాతీయ సదస్సుకి ఆచార్య జి.శశిభూషణ రావు ముఖ్య అతిధి గా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం మనం అధునాతన టెక్నాలజీ లో నూతన పారిశ్రామిక ఆవిష్కరణల దిశగా మనుగడ సాగిస్తున్నామని అన్నారు. రాబోయే కాలం లో టెక్నాలజీ అనేది మరింతగా అభివృద్ధి చెందడం వలన మనం నూతన జీవన విధానం కలిగి వుండబోతున్నామని అన్నారు. ఈ విషయమై మొబైల్ నెట్వర్క్ యొక్క రూపాంతరం అభిరుద్ధిని ఉదహరించారు . అదేవిధం గా మానవ జాతి మనుగడకు సాంకేతిక అభివృద్ధి అనేది అవరోధం కారాదని అన్నారు. ఈ సందర్భంగా సదస్సుకు సంబందించిన సావనీర్



ని ఏయూ విసి ఆచార్య శశి భూషణ రావు ఆవిష్కరించారు . ఎం.ఎస్.ఎం.ఇ డైరెక్టర్ జనరల్ డా.ఎస్ .గ్లోరీ స్వరూప మాట్లాడుతూ పరిశ్రమల నుండి వస్తున్నా వ్యర్ధాలను పర్యావరణ హితంగా మలిచేందుకు నూతన పరిశోధనలు మరియు నూతన ఆవిష్కరణలు జరగాలని అన్నారు .అంతర్జాతీయ నిపుణులు సైతం ఈ విషయం పై అనేక పరిశోధనలు జరుపుతున్నారని అన్నారు పరిశ్రమలు దేశం యొక్క అభివృద్ధికి

(మిగతా 2లో)



## కృత్రిమ మేధపై పరిశోధనలకు గీతంలో భారీ ప్రాజెక్టు

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** కేంద్ర ప్రభుత్వ వికసిత్ భారత్ లక్ష్యాలలో భాగంగా కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) మరియు మెషిన్‌లెర్నింగ్ పరిశోధనలకు గాను భారత ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక విభాగం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంకు భారీ పరిశోధన ప్రాజెక్టును మంజూరు చేసింది. గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగం అధిపతి డాక్టర్. పి.భరణి చంద్రకుమార్ ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్‌గా వ్యవహరించనున్నారు. ప్రొఫెసర్ రాజా ఫణి పప్పు, వికాస్ శ్రీ వాత్సవ్ లు ఈ పరిశోధన ప్రాజెక్టుకు సహకారం అందించనున్నారు. ఈ ప్రాజెక్టులో భాగంగా పరిశోధనలతో పాటు కృత్రిమ మేధ, మెషిన్ లెర్నింగ్‌లలో టెక్నాలజీ బిజినెస్ ఇంక్యుబేటర్‌ను గీతం విశ్వవిద్యాలయంలో నెలకొల్ప నున్నారు. ఈ టెక్నాలజీ బిజినెస్ ఇంక్యుబేటర్ ద్వారా దాదాపు 50 స్టార్టప్‌లను విశాఖలో ప్రోత్సహించడంతో పాటు 2026 సంవత్సరం నాటికి కనీసం 20 ఐటి ఉత్పత్తులను మార్కెట్‌లోకి తేవాలన్నది లక్ష్యంగా పెట్టుకున్నట్లు ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్ డాక్టర్. పి.భరణి చంద్రకుమార్ తెలిపారు. దాదాపు రూ.4.57 కోట్ల రూపాయల వ్యయంతో నిర్వహించనున్న ఈ పరిశోధన మరియు టెక్నాలజీ బిజినెస్ ఇంక్యుబేటర్ లో భాగంగా నెలకొల్పే ప్రాజెక్టు కేంద్రం ద్వారా పరిశోధనలు, స్టార్టప్‌ల ఏర్పాటు, సాంకేతిక పత్రాలను వెలువరించడం, నూతన ఐటి ఉత్పత్తుల అభివృద్ధి, పేటెంట్ హక్కులను పొందడం జరుగుతందని ఆయన వెల్లడిరచారు. కాగా కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టును సాధించనందుకు గీతం పరిశోధక బృందాన్ని ఇన్‌ఛార్జి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు అభినందించారు.

## తాటితూరులో నూతన గ్రంధాలయం ప్రారంభం



**భీమునిపట్నం, (విశాఖ సమాచారమ్):** భీమిలి మండలం తాటితూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో గురువారం నూతన గ్రంధాలయం ప్రారంభం అయ్యింది. భీమిలి కి చెందిన కలిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ అధ్వర్యంలో జరిగిన కార్యక్రమం లో పాల్గొన్న ఫౌండేషన్ అధ్యక్షులు కలిగొట్ల శ్రీరామ చంద్రమూర్తిగ్రంధాలయం ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ ఈ గ్రంథాలయంలో ఫర్నిచర్ ఫౌండేషన్ సేవా కార్యక్రమాల్లో భాగంగా గ్రంధాలయం కు ఫర్నిచర్ కొనుగోలు నిమిత్తం తమ ఫౌండేషన్ 23 వేల రూపాయిలను సహాయంగా అందజేశామన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు డొకర శ్రీనివాసరావు, గ్రామ సర్పంచ సిరిగుడి సంతోషిఈశ్వరరావు , తల్లిదండ్రుల కమిటీ అధ్యక్షులు సోమేశ్వరరావు గారు, మాజీ వైస్ సర్పంచ్ పతివాడ రాంబాబు, ఉపాధ్యాయులు మురళీ, ప్రసాద్రావు శ్రీనివాసరావు జె అప్పలనాయుడు, ప్రభావతి, రాంబాబు ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 17 నుండి అక్టోబర్ 1 వరకు స్వచ్ఛతా హై సేవా కార్యక్రమాలు

### అక్టోబర్ 2 న గాంధీ జయంతి సందర్భంగా స్వచ్ఛ భారత్ దివాస్



**విజయనగరం:** జిల్లాలో ఈ నెల 17 నుండి అక్టోబర్ 1 వరకు స్వచ్చతా హై సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ తెలిపారు. గురువారం కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. దేశ వ్యాప్తంగా మహాత్మా గాంధీ జయంతిని పురష్కరించుకొని ఈ నెల 17 నుండి అక్టోబర్ 1 వరకు స్వచ్చతా హై సేవా కార్యక్రమాలు జరుగుతాయని, అక్టోబర్ 2 న స్వచ్ఛ భారత్ దివాస్ గా జరుపుకోవడం జరుగుతుందని తెలిపారు. స్వచ్చతా సేవా కార్యక్రమాల్లో భాగంగా జిల్లాలో 3 రకాలు కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. ఈ నెల 17 న ప్రారంభోత్సవం ఉంటుందని, 18 నుండి అక్టోబర్ 1 వరకు పలు కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు.

స్వచ్చతాకి భగీదరి లో భాగంగా తల్లి పేరుతో ఒక మొక్కను నాటడం , మెప్మా, డ్వాక్రా , స్వచ్ఛంద సంస్థల అధ్వర్యం లో స్థానిక స్వచ్చతా కార్యక్రమాల పై అవగాహనా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. విద్యుత్, నీటిని ఆదా ప్లాస్టిక్ నిరోధం , తాగు నీటిని క్లోరినేషణ్ చేయడం, ఆరోగ్యకరమైన జీవితం , తదితర అంశాల పై అవగాహన కలిగించడం జరుగుతుందన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం, పార్క్ లలో గ్రామలో సేల్ఫీ పాయింట్ లను ఏర్పాటు చేయడం, సాలిడ్ వేస్ట్ భవనాలకు పెయింటింగ్ చేయడం , అన్ని విద్యా సంస్థలలో స్వచ్చతా ప్రతిజ్ఞ చేయించడం స్వచ్ఛ పంచాయత్, వార్డ్ లలో పోటీలు నిర్వహించడం ర్యాలీలు, మానవ హారం నిర్వహించడం తదితర కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

సంపూర్ణ స్వచ్చతా - స్వచ్చతా లక్షిత్ కార్యక్రమం లో భాగంగా నీటి నిల్వలు ఉన్న చోట్లను గుర్తించి బ్లీచింగ్ చల్లడం, ఘన వ్యర్థాలను తరలించడం, పార్కుల, డ్రైనేజ్, రహదారుల, విద్యా సంస్థల , వాణిజ్య సముదాయాల క్లీనింగ్, పబ్లిక్ స్థలాల్లో సుందరీకరణ తదితర కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. సఫాయి మిత్ర సురక్ష శివిర్ కార్యక్రమం లో భాగంగా వైద్య ఆరోగ్య సేవలు, పారిశుధ్య పని వారిని గుర్తించి పిపిఈ కిట్లను అందించడం, ప్రభుత్వ పధకాలను అందించడం, లబ్దిదారుని ఆయా పథకాలకు మాపింగ్ చేయడం, మొబైల్ హెల్త్ క్యాంపు ల నిర్వహణ, సఫాయి మిత్ర లకు ఆరోగ్య అవగాహనా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. బాలల సురక్షా కార్యక్రమాలు, వాక్సినేషన్ డ్రైవ్, పోషకాహార పంపిణీ, హెల్త్ ఇన్సురెన్సు నమోదుకు సహకారం, స్కిల్ డెవలప్మెంట్ వర్క్ షాప్స్ , ఆఖరున సన్మాన కార్యక్రమాలు జరుగుతయాని తెలిపారు.

కార్యక్రమాలు మూడు రకాలుగా అన్ని మండల కేంద్రాల్లో, మున్సిపాలిటీలలో, నియోజక వర్గం పరిధి లో జరుగుతాయని, ప్రజా ప్రతినిధులు కూడా పాల్గొనేలా చూడాలని అధికారులకు ఆదేశించారు. అక్టోబర్ 2 వ తేదీన స్వచ్ఛ భారత్ దివాస్ ఉత్సవం తో కార్యక్రమాలు ముగుస్తాయని, ఈకార్యక్రమాలను స్పేదిలే ప్రకారంగా నిర్వహించి విజయవంతం తెలిపారు.

ఈ సమావేశం లో సి.పి.ఓ బాలాజీ, డి.పి.ఓ శ్రీధర్ రాజ, డ్వామా , ఐ.సి.డి.ఎస్ పి.డి లు ఉమా పరమేశ్వరి, శాంతకుమారి, డి.ఎం.హెచ్ ఓ డా. భాస్కర రావు, డి.ఆర్.డి.ఎ పి.డి కళ్యాణ చక్రవర్తి, డి.ఈ.ఓ ప్రేమ్ కుమార్, ఎల్.డి.ఎం మూర్తి, మెప్మా పి.డి. సుధాకర్ రావు, ఆర్.ఐ.ఓ తదితరులు పాల్గొన్నారు.

### పంచాంగం

శుక్రవారం 13 -09-2024
క్రోధి నామ సంవత్సరము
దక్షిణాయణం, వర్షరుతువు
భాద్రపద మాసం

| | |
|---|---|
| తిథి | : బ. దశమి సా. 05.30 |
| నక్షత్రం | : పూర్వాషాఢ సా. 06.02 |
| వర్జ్యం | : రా. 01.55 ల 03.29 |

## ఎయిడ్స్ పట్ల సంపూర్ణ అవగాహనతో నివారణ సాధ్యం : జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** ఎయిడ్స్ వ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ పిలుపునిచ్చారు. గురువారం ఆమె కలెక్టరు కార్యాలయంలో సురక్షితమైన సెక్స్ ప్రాక్టీస్ గురించి సాధారణ జనాభా మరియు యువతలో అవగాహనను పెంపొందించడానికి, సామాజిక కళంకాన్ని తగ్గించడానికి, దిశా ద్వారా హెచ్ఐవి మరియు ఎయిడ్స్ వ్యాప్తిని తగ్గించడానికి ఆరోగ్యకరమైన ఎంపికలను ప్రోత్సహించడానికి ఐఇసి ప్రచారం 2024 యొక్క గోడపత్రికను (పోస్టర్) ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డి ఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ బాలాజీ డాక్టర్. స్పందన, రామచంద్ర, మరియు పి పి టి సి సిబ్బంది, స్వచ్ఛంద సంస్థలు ( కేర్ అండ్ సపోర్ట్ ఎస్వీడీఎస్) తదితరులు పాల్గొన్నారు.

## వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

**పార్వతీపురం, (విశాఖ సమాచారమ్):** పాఠశాల ప్రత్యేక అధికారులు పాఠశాలను విధిగా సందర్శించాలని, చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టరు కార్యాలయం నుండి "మై స్కూల్ మై ప్రైడ్" కార్యక్రమంపై పాఠశాల ప్రత్యేక అధికారులు, ఎం పి డి ఒ, ఎం ఇ ఒ, ఇతర అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సమావేశంలో జిల్లా కలెక్టరు మాట్లాడుతూ గత మూడు సంవత్సరాలనుండి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ప్రత్యేక అధికారులు వారంలో కనీసం రెండు రోజులు పాఠశాలలను సందర్శించాలని ఆదేశించారు. ప్రతి విద్యార్థి సక్రమగా హాజరు, చక్కని నాణ్యమైన విద్యాబోధన, మంచి మార్కులు సాధన లక్ష్యాలుగా పనిచేయాలన్నారు. ఇటీవల జరిగిన సమ్మెటివ్ పరీక్షలను ఆధారంగా చేసుకొని విద్యార్థులు ఏ అంశంలో వెనుకబడి ఉన్నారో



పరిశీలించాలని, అందులో వారు మెరుగైన ఫలితాలు సాధించుటకు అవసరమగు అన్ని సూచనలు, సలహాలు ఇవ్వాలని పేర్కొన్నారు. పాఠశాల సందర్శనలో విద్యాబోధన, విద్యార్థుల హాజరు, విద్యా ప్రమాణాలు, ఉపాధ్యాయులు పుస్తకాల తనిఖీ, పాఠశాల పరిసరాలు, మా బడి మా తోట వంటి కార్యక్రమాలను తనిఖీ చేయాలని ఆయన స్పష్టం చేశారు. ముఖ్యంగా తొమ్మిది, పదవ తరగతి విద్యార్థుల్లో వివిధ సబ్జెక్టుల్లో వారి అవగాహన స్థాయిని పరిశీలించాలని జిల్లా కలెక్టర్ అన్నారు. ఒక విద్యార్థి ఎందుకు వెనుకబడి ఉన్నాడో కారణాలు స్పష్టంగా గుర్తించాలని తద్వారా ఆ విద్యార్థి సామర్థ్యాన్ని మెరుగుపరిచి ఆ అంశంలో నిపుణుడు అయ్యే విధంగా తీర్చిదిద్దాలని అన్నారు. విద్యార్థులు - ఉపాధ్యాయుల మధ్య మంచి సంబంధాలు ఏర్పాటు చేయాలని తద్వారా విద్యార్థులు వారి సందేహాలను వెంటనే పరిష్కరించుకోగలరని చెప్పారు. ప్రతి సబ్జెక్టు కు ఉపాద్యాయుడు ఉండేలా చర్యలుతీసుకోవాలని, షెడ్యూలు ప్రకారం సిలబస్ పూర్తిచేయాలని తెలిపారు. ప్రతి విద్యార్థి మంచి విద్యా ప్రమాణాలు కలిగిఉండే విధంగా విద్యనందించాలని తెలిపారు. విద్యార్థి పాఠశాలకు గైరుహాజరైతే వారి తల్లిదండ్రులతో మాట్లాడాలని, బడిమానివేసిన విద్యార్థులను బడికి తీసుకురావాలని తెలిపారు. సెల్ ఫోన్లు, బయటి ఆహారం(జంక్ ఫుడ్) పాఠశాలలకు తీసుకురాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా గత రెండు సంవత్సరాలుగా రాష్ట్రంలోనే పదో తరగతి పరీక్షల్లో ప్రథమ స్థానంలో నిలిచిందని అదే స్థానాన్ని నిలుపుటకు ప్రత్యేక అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు కృషి చేయాలని ఆయన అన్నారు. ఇంగ్లీషు మీడియం విద్యార్థులు ఇంగ్లీషు బాష పరీక్షలు వ్రాయలేకపోతున్నందున వారు తెలుగులో పరీక్షలు వ్రాయవచ్చునని, ఇంగ్లీషు మీడియం విద్యార్థులకు బాషలో ప్రావీణ్యత పెంపొందించాలని తెలిపారు.

ఈ సమావేశంలో జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె. రామచంద్ర రావు, డి ఆర్ డి ఎ పిడి వై. సత్యంనాయుడు, జిల్లా ఆర్.డబ్ల్యు.ఎస్ ఇంజనీరింగ్ అధికారి ఓ. ప్రభాకరరావు, మండల అభివృద్ధి అధికారులు, మండల విద్యాశాఖాధికారులు, ఇతర అధికారులు హాజరైనారు.

## (మొదటి పేజీ తరువాయిలు)

### ఉద్యోగుల బదిలీలకు గడువు పెంపు

ఇప్పటికే పలు శాఖల్లో ఉద్యోగుల బదిలీలకు మార్గదర్శకాలు విడుదల కాగా.. మిగిలిన శాఖల్లో బదిలీలకు ఆయా శాఖలు మార్గదర్శకాలు విడుదల చేస్తున్నాయి. వీటి ప్రకారం ఈ నెల 22 వరకూ బదిలీల ప్రక్రియ కొనసాగనుంది. అనంతరం సెప్టెంబర్ 23 నుంచి తిరిగి బదిలీలపై నిషేధం అమల్లోకి రానుంది. ఎక్సైజ్ శాఖకు మాత్రం ఈ నెల 30 వరకూ బదిలీల గడువు పొడిగించారు. వీరికి అక్టోబర్ 1 నుంచి బదిలీపై నిషేధం అమల్లోకి వస్తుంది.

### విశాఖను దేశంలోనే నెం.1 స్థానంలో నిలబెట్టాలి

మంత్రి విశ్వకర్మ తదితర 66 కేంద్ర ప్రాయోజిత పథకాల తీరుతెన్నులు, ఇతర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు.

ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో వ్యవహరించి కేంద్రం అమలు చేస్తున్న పథకాల ఫలాలు అర్హులైన ప్రజలందరికీ అందేలా కృషి చేయాలన్నారు. విద్యా రంగానికి పెద్దపీట వేయాలని, యువతకు ఉపాధి కల్పనలో భాగంగా నైపుణ్య శిక్షణ అందించాలని సూచించారు. ప్రధాన మంత్రి సూర్యఘర్ పథకంపై విస్తృత అవగాహన కల్పించి వీలైనంత ఎక్కువ మంది కనెక్షన్లు పొందేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. విశ్వకర్మ యోజన ద్వారా ఎక్కువ మందికి ఉపాధి కల్పించాలని సూచించారు. పేదలకు పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, గృహ సంబంధిత పథకాలను పక్కాగా అమలు చేయాలని చెప్పారు. ఈ క్రమంలో హుద్ హుద్, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకాల్లో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాల ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. అర్ధాంతరంగా ఆగిపోయిన పథకాల వివరాలను అందజేయాలని, వాటిల్లో కదలిక వచ్చేలా సంయుక్తంగా చర్యలు చేపడదామని ఎంపీ పేర్కొన్నారు.

మేఘాద్రి గెడ్డ, గంభీరం రిజర్వాయర్ల నిర్వహణలో సమన్వయం లోపం తలెత్తకుండా, భవిష్యత్తులో ఇబ్బందులు రాకుండా తగిన చర్యలు చేపట్టాలని, పూడికలు తొలగించేందుకు ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అమలవుతున్న పథకాల ఫలాలు మరింత మందికి అందేలా చర్యలు చేపట్టాలని, 170 శాశ్వత భవనాల నిర్మాణం, సిబ్బంది నియోమకానికి సంబంధించిన వివరాలతో కూడిన ప్రతిపాదనలు రూపొందించి తనకు ఇవ్వాలని ఎంపీ సంబంధిత అధికారులను కోరారు. ఆశా కార్యకర్తల నియామకం, జనరిక్ ఔషధ కేంద్రాల ఏర్పాటు, స్కిల్ డెవలప్మెంటు కేంద్రాల ఏర్పాటులో అధికారులు చొరవ చూపాలని, సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని ఎంపీ చెప్పారు. పథకాల అమలు, అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణ, ప్రాజెక్టుల రూపకల్పన తదితర అంశాల్లో అధికారులు పక్కా డేటా సేకరించాలని, స్పష్టత, నాణ్యతతో కూడిన నివేదికలు రూపొందించి అందించాలని ఎంపీ ఈ సందర్భంగా సూచించారు.

ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, గణబాబు, వెలగపూడి రామకృష్ణ బాబు, పంచకర్ల రమేష్ బాబు పలు అంశాలపై ప్రశ్నలు లేవనెత్తటంతో పాటు సూచనలు చేశారు. జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ జిల్లా యంత్రాంగం చేపడుతున్న చర్యలను, అధికారులు చేస్తున్న కృషిని వివరించారు.

సమావేశంలో తెదేపా జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ, జిల్లా రెవెన్యూ అధికారి కె. మోహన్ కుమార్, జిల్లా పరిషత్ సీఈవో సత్యనారాయణ, వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### కమ్యూనిస్టు దిగ్గజం సీతారాం ఏచూరి కన్నుమూత

ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అప్పటినుంచి ఆ పదవిలో కొనసాగుతున్నారు.

**ప్రజాసమస్యలపై గళం విప్పుతూ..**

ప్రజాసమస్యలు, ఇతర అంశాలపై గళం విప్పుతూ.. ఎగువ సభలో సీతారాం ఏచూరి గుర్తింపు పొందారు. 1996లో యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వం కోసం 'కామన్ మినిమమ్ ప్రోగ్రామ్' ముసాయిదాను రూపొందించడంలో మాజీ కేంద్ర మంత్రి పి.చిదంబరంతోపాటు ఏచూరి కీలకంగా వ్యవహరించారు. 2004లో యూపీఏ సంకీర్ణ ప్రభుత్వ నిర్మాణంలోనూ ముఖ్య భూమిక పోషించారు. రచయితగానూ మంచి గుర్తింపు ఉంది. 'లెఫ్ట్ హ్యాండ్ డ్రైవ్' పేరిట ఓ ఆంగ్లపత్రికకు కాలమ్స్ రాశారు. 'క్యాస్ట్ అండ్ క్లాస్ ఇన్ ఇండియన్ పాలిటిక్స్ టుడే', 'సోషలిజం ఇన్ ఛేంజింగ్ వరల్డ్', 'మోదీ గవర్నమెంట్: న్యూ సర్జ్ ఆఫ్ కమ్యూనలిజం', 'కమ్యూనలిజం వర్సెస్ సెక్యులరిజం' వంటి పుస్తకాలు రాశారు.

### గ్రేటర్ లోకి గ్రామీణం : గంటా శ్రీనివాసరావు

కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఎయిర్ పోర్టు నిర్మాణంతో పాటు సమాంతరంగా ఎలివేటెడ్ కారిడార్లు, ఫ్లయ్ ఓవర్ బ్రిడ్జిలు, మెట్రో పనుల ప్రణాళిక కూడా రూపొందించాలని చెప్పారు. అభివృద్ధిలో భాగంగానే భీమిలి మెయిన్ రోడ్డు, బీచ్ రోడ్డు, లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం రోడ్డులను విస్తరిస్తున్నామని తెలిపారు.

**వైసీపీని బ్యాన్ చెయ్యాలి**

వరదల్లో ప్రజలను ఆదుకోకపోగా, సహాయక చర్యలు తీసుకుంటున్న ప్రభుత్వంపై విషం చిమ్ముతున్న వైసీపీపై బ్యాన్ విధించాలని గంటా డిమాండ్ చేశారు. జగన్ ఆరోపించిన "మ్యాన్ మేడ్ ఫ్లడ్స్" పదం మొదటిసారి వింటున్నానని, ప్రకృతి విలయాలు వ్యక్తుల వల్ల ఎలా నియంత్రించగలరని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇంటిని కాపాడుకోవడానికి వరద నీటిని మళ్లించడం వల్ల విజయవాడకు వరదలు వచ్చాయనడం, బుడమేరు వాగును నదిగా ప్రస్తావించిన జగన్మోహన్ రెడ్డి అవగాహన మీద అనుమానం వస్తుందని తెలిపారు. వేలాదిమంది ప్రజలు కష్టాల్లో ఉంటే పట్టించుకోకుండా జైల్లో ఉన్న అనుచరుడిని పరామర్శించడాన్ని ఏ రకంగా చూడాలని నిలదీశారు. డిప్యూటి సీఎం పవన్ కళ్యాణ్ కష్టార్జితం నుంచి రూ.6 కోట్ల విరాళం ప్రకటిస్తే, రూ. లక్ష కోట్లున్న జగన్ రూ. కోటి మాత్రమే ప్రకటించారని, నాయకుల మధ్య తేడాలను ప్రజలు నిశితంగా గమనిస్తున్నారని పేర్కొన్నారు. సినిమా ఇమేజ్ గల పవన్ కళ్యాణ్ పాల్గొంటే వరద సహాయ కార్యక్రమాల్లో తొక్కిసలాట జరిగే అవకాశం ఉందనే వరద ఏర్పాట్లను పరోక్షంగా పర్యవేక్షించారని, దాన్ని కూడా రాజకీయం చేసిన కుసంస్కారి జగన్ అని దుయ్యబట్టారు.

**రోల్ మోడల్ సీఎం చంద్రబాబు**

ప్రకృతి విపత్తు నుంచి ప్రజలను త్వరితగతిన తేరుకునేల చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రపంచానికే రోల్ మోడల్ గా నిలిచారని గంటా ప్రశంసించారు. 11 రోజుల పాటు కలెక్టరేట్ లోనే ఉండి డ్రోన్లు, సీసీ కెమెరాల వంటి టెక్నాలజీ సహకారంతో వరద సహాయ కార్యక్రమాలు పర్యవేక్షించారన్నారు. వరదల్లో ఎన్డీఆర్ఎఫ్ బృందాలు ప్రాణాలు తెగించి చేసిన సేవలను శ్లాఘించారు. వైసీపీ మునిగిపోయిన నావ అని పేర్కొంటూ టిడిపి గేట్లు తెరిస్తే ఆ పార్టీలో జగన్మోహన్ రెడ్డి ఒక్కరే మిగులుతారని చెప్పారు.

**సాయిరెడ్డి ఎపిసోడ్ లో ఇది ఆరంభమే**

భీమిలి తీరంలో విజయసాయి రెడ్డి కుమార్తె నేహారెడ్డి నిబంధనలకు విరుద్ధంగా బీచ్ లో నిర్మించిన ప్రహరీ కూల్చివేతపై మాట్లాడుతూ ఇది ఆరంభం మాత్రమేనని వ్యాఖ్యానించారు. వైసీపీ పెద్దలు బెదిరించి భూములు రాయించుకున్నారని, అవన్నీ వైజాగ్ ఫైల్స్ పేరిట బహిర్గతం చేస్తామని గంటా చెప్పారు. వైసీపీ అరాచకాలపై ఫిర్యాదు కౌంటర్ పెడితే వేలాది ఫిర్యాదులు వెల్లువెత్తుతాయన్నారు. కొండలు, వాగులు, నదీ పరీవాహక ప్రాంతాల్లో భూకబ్జాలు చేసిన వారిని కట్టడి చేయడానికి హైదరాబాద్ లో హైడ్రా తరహా కఠినమైన విధానం రాష్ట్రంలో కూడా ఉండాలని అభిప్రాయపడ్డారు. మాజీ ఎమ్మెల్యే అప్పలనాయుడు, జనసేన నాయకులు పంచకర్ల సందీప్, శాఖారి శ్రీనివాస్, కార్పొరేటర్లు గాడు చిన్ని కుమారి, లొడగల అప్పారావు పాల్గొన్నారు.

### సాంకేతిక మరియు పారిశ్రామిక అభివృద్ధి అనేది పర్యావరణ హితంగా ఉండాలి

దోహదపడుతున్న విషయం ఎంత నిజమో అదే పరిశ్రమలు పర్యావరణాన్ని కలుషితం చేస్తున్నాయి అనడం కూడా అంతే నిజమని అన్నారు. ఈ విషయమై పరిశ్రమల నిర్వాహకులు సైతం భాద్యత యుతంగా నిలిచి ప్రకృతికి హాని కలగకుండా చూడాలని అన్నారు. భారత ప్రభుత్వం సైతం వేస్ట్ మేనేజ్మెంట్ పైన అనేక అధ్యాయనాలు చేసేందుకు ప్రోత్సహిస్తుందని అన్నారు.

సాంకేతిక పరిగ్యానమ్ అనేది నేటి తరానికి అత్యంత ముఖ్యమని దేశాభివృద్ధికి సాంకేతికత ముఖ్య భూమిక పోషిస్తుందని అన్నారు అదే విధంగా వ్యర్థాల నిర్వహణ ఎంత ముఖ్యమో ఉన్నవనరులను వృధాచేయకుండా ఆదా చేయడం అంతే ముఖ్యమని ఉదాహరణకు నీరు కరెంటు,పేపరు వంటి వాటిని ఊరికే వృధా చేయడం తగదని అన్నారు. దేశాభివృద్ధిలో వ్యవసాయం తరువాత ఎం ఎస్ ఎం ఇ లు కీలక పాత్ర పోషిస్తున్నాయి అని అన్నారు . ఈ సదస్సు ద్వారా విశాఖ కు చెందిన పోర్ట్, స్టీల్ ప్లాంట్ , టూరిజం మరియు ఎక్వకల్చర్ లకు మంచి ప్రోత్సాహకం లభిస్తుందని అన్నారు భవిష్యత్ కోసం భద్రతా కలిగిన పర్యావరణ విధానాలను పరిశ్రమలు అవలంభించాలని అన్నారు. యూనివర్సిటీలు ప్లాస్టిక్ ఫ్రీ కార్బన్ ఫ్రీ, గ్రీన్ ఎనర్జీ వంటి అంశాలపై విస్తృత పరిశోధనలు చేయాలనీ అన్నారు. కార్యక్రమంలో శరత్ ముత్యాల అసోసియేట్ ఫ్యాకల్టీ (ఎం.ఎస్.ఎం.ఇ). జె.కోటేశ్వర రావు అసోసియేట్ ఫ్యాకల్టీ (ఎం.ఎస్.ఎం.ఇ), డి.దాస్ నేషనల్ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్, యు.ఎన్.ఐ.డి.ఓ. న్యూ ఢిల్లీ, కెనడా నుండి అల్బెర్టా అనిమల్ జెనెటిక్స్ కన్సల్టింగ్ గ్రూప్ ప్రెసిడెంట్ అల్ఫ్రెడ్ వర్త్ మరియు ఆ హబ్ సి.ఇ.ఓ రవి ఈస్వరపు తదితరులు సదస్సులో ప్రసంగించారు శ్రీలంక, కెన్యా మరియు స్వీడన్ తదితర దేశాల తో పటు దేశం నలుమూలలనుండి చిన్న, మధ్యతరగతి పరిశ్రమల ప్రతినిధులు ఈ సదస్సులో పాల్గొన్నారు. అనంతరం ఎయు విసి ఆచార్య శశిభూషణ రావు సదస్సు సందర్భంగా ఏర్పాటు చేసిన గ్రీన్ ఎగ్జిబిషన్ ను ప్రారంభించి స్టాల్స్ ను సందర్శించారు.

విశాఖ సమాచారమ్

శుక్రవారం 13-09-2024

# సమ భావన

భారతీయ ఋషికి ప్రధానమైన లక్ష్యం విశ్వశ్రేయస్సు. విశ్వము అనే 'మాట'కి సమస్తము అని అర్థం. సమస్తము శ్రేయస్సుగా ఉండాలి. అంతేగానీ ఏదో ఒక ప్రాంతం బాగుండాలి. ఒక వర్గం బాగుండాలి అనేటటువంటి భావన మనకుండదు.

అయితే నావర్గం వాళ్ళు బాగుండాలి. మిగిలిన వర్గాల వాళ్ళు అజ్ఞానులు. వాళ్ళు నశించాలి లేదా వాళ్ళు మా దాన్లోకి మారితే అప్పుడు వాళ్ళు రక్షింపబడతారు అనే భావం అన్ని సంస్కృతులలో కనబడుతుంది. కానీ భారతీయ వైదిక సంస్కృతిలో మాత్రము ఎవరు దేనికి చెందినప్పటికీ వారు బాగుండాలి అనే గొప్ప భావన 'విశ్వశ్రేయోకాంక్ష'. మన ఆలయాల్లో కూడా 'అస్మిన్ గ్రామ స్థిత సర్వేషాం' అంటారు.

అంటే ఈ ప్రాంతములో ఉన్న అందరూ, అందరూ అన్నప్పుడు అన్ని వర్గాల వారు, స్త్రీలు, పురుషులు అదేవిధంగా ప్రకృతి. ఆ ఊరిలో ఉన్న ప్రకృతి కూడా బాగుండాలి. ఇదీ కాంక్ష. ఈ కాంక్ష ఎంత విస్తారంగా కనబడుతుందంటే 'లోకాస్సమస్తాస్సుఖినో భవన్తు' అనే వాక్యంలో ప్రతిష్ఠింపబడింది. ఈ కాంక్ష భూలోకానికి మాత్రమే కాకుండా విస్తరించి చతుర్దశ భువనాలూ క్షేమంగా ఉండాలని కోరుకుంటున్నది. అందుకే మన సంస్కృతిలో గొప్ప అంశం. చతుర్దశ భువనాలు కలిపి ఒకే భగవత్ స్వరూపంగా చూడడం, అదొక అత్యద్భుతమైన 'కాన్సెప్ట్' లేదా గొప్ప దర్శనం. భగవంతుడికంటూ ఒక లోకం కాదు. లోకమంతా భగవంతుడు. ఈ ఆకాంక్ష మనకు విశ్వరూప సందర్శనంలో కనబడుతుంది. దీన్నే విష్ణుసహస్ర ధ్యాన శ్లోకంలో చెప్పారు.

కనీసం వీటికి అర్థాలు మనం పిల్లలకి చెప్పగల్గినా మన సంస్కృతిలో భగవంతుడంటే ఉన్న నిర్వచనమేమిటో స్పష్టమౌతుంది.

**"భూఃపాదౌ యస్య నాభిర్వియదసురనిలశ్చంద్ర సూర్యౌచనేత్రే కర్ణావాసా శ్శిరోద్యౌర్ముఖమపి దహనో యస్య వాస్తేయ మబ్ధిః...చిత్రం రం రమ్యతీతం త్రిభువన వపుషం విష్ణుమీశం నమామి"**. విష్ణు సహస్ర నామాలకి ముందు ఇది విరాట్ పురుషవర్ణన.

ఇందులో భూమి మొదలుకొని అంతరిక్షం వరకూ అంతా కలిపి ఒకే భగవత్స్వరూపంగా చూశారు. ఇక మానవులు, పశువులు, పక్షులు సర్వమూ చెట్లూ, చేమలూ, గ్రహాలూ, నక్షత్రాలు ఇవన్నీ కూడా భగవంతుడనే విశ్వరూపమందు లేదా విశ్వరూపమైన భగవంతునియందు అవయవ స్థానాలుగా దర్శించారు.

"శరీరంలో ఏ అవయవానికి బాధకల్గినా మనకు బాధ కల్గినట్లే. సమాజంలో ఏ ఒక్కరికి బాధ కల్గినా పరమ పురుషుని బాధ పెట్టినట్లే" అనే భావం. అందుకే లోకములన్నీ బాగుండాలి అంటే లోకముల రూపంలో ఉన్న భగవంతుడు బాగుండాలని కోరిక. అయితే లోక క్షేమం ఎవరు కోరుకుంటాడో వాడి క్షేమం భగవంతుడు నెరవేరుస్తాడు. లోకం ఎలాపోతే పోయింది నేను బాగుంటే చాలు అనుకున్న వాడు తప్పకుండా బాగుండడు. సమస్త లోక క్షేమాన్ని కాంక్షించే వాడే తాను బాగుండడానికి అర్హుడౌతున్నాడు. అందుకే ఈ భావం అనేకచోట్ల **'స్వస్తి ప్రజాభ్యః...'**నుంచి **'లోకాస్సమస్తాః సుఖినోభవన్తు'** వరకు **'సర్వే భవన్తు సుఖినః' 'సర్వే సంతు నిరామయాః' సర్వే భద్రాణి పశ్యంతు' 'మాకశ్చిత్ దుఃఖభాక్ భవేత్'** ఇది ఒక వేద ఆకాంక్ష, ఆశీస్సు. అందరూ సుఖంగా రోగరహితులై ఉండాలి. అందరికీ శుభాలు కలుగుతూ ఉండాలి.

ఏ ఒక్కడూ దుఃఖాన్ని పొందకూడదు. ఇది గమనించినట్లయితే అవతలివాడి నాక్రమించాలి, హింసించాలి, వాడిని మార్చేయాలి, అనే తాపత్రయాలు పోతాయి. అందుకు విశాలమైన దృక్పథం మన హైందవ సంస్కృతిలో కనబడుతున్నది. ఆ కారణం చేతనే అందరినీ గౌరవిస్తాం.

దీన్ని అలుసుగా తీసుకుని అతడు మన ఉనికికే ప్రమాదకరంగా మారకుండా జాగ్రత్తపడాలి. విశ్వహితకాంక్షని ఇంత గొప్పగా మన ధర్మం చూపించింది.

# ఏచూరి మృతికి సంతాపం



**భీమునిపట్నం, (విశాఖ సమాచారమ్):** సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతికి సంతాప సూచకంగా స్థానిక సి ఐ టి యు కార్యాలయం వద్ద గురు వారం సాయంత్రం సంతాప సభ నిర్వహించారు.ముందుగా ఆయన చిత్ర పటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భం గా

సిపిఎం భీమిలి జోనల్ కార్యదర్శి ఆర్ ఎస్ ఎన్ మూర్తి మాట్లాడుతూ భౌతికంగా ఏచూరి సీతారాం దూరమైన ప్పటికీ ఆయన అశయ సాధనకు పార్టీ నాయకులందరు కలిసి కృషి చేయాలని ఆయన కోరారు .

కార్యక్రమంలో సి పి ఎం, సి ఐ టి యు , నాయకులు రవ్వ నరసింగరావు, ఎస్ అప్పల నాయుడు, నీ లా తి రాము, పి పెంట రాజు, రామకృష్ణ, చిన్నా రావు, పి ఎన్ ఎం కళాకారులు పంపాన సూర్య నారాయణ తది తరులు పాల్గొన్నారు.

# పౌష్టికాహార ఆవశ్యకత పై విద్యార్థులకు అవగాహన



**భీమునిపట్నం, (విశాఖ సమాచారమ్):** భీమిలి మండలం మజ్జిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో పౌష్టికాహార ఆవశ్యకత పై విద్యార్థులకు గురువారం అవగాహన కార్యక్రమం జరిగింది. పౌష్టికాహార దినోత్సవం సందర్భం గా మేజిక్ బస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమం ను గ్రామ సర్పంచ్ మజ్జి సూరినాయుడు ప్రారంభించారు. ఈ సందర్భం గా ప్రధానోపాధ్యయురాలు ఉషారాణి మాట్లాడుతూ బాల్యం నుండే పిల్లలకు పౌష్టికాహారం అందజేయడం వల్ల వారు శారీరకం గా మానసికం గా ఎదగగలరని అంటూ ఆ దిశలో తల్లి తండ్రులు పిల్లలకు పౌష్టికాహారం అందించి వారి ఎదుగుదలకు దోహద పడాలని కోరారు. అనంతరం నిర్వహించడం నిర్వహించిన వంటల పోటీలో సుమారు 40 మంది తల్లులు పాల్గొన్నారు. వీరిలో ప్రథమ బహుమతి గెలుచుకొన్న సుధారాణి కి నిర్వాహకులు స్టీల్ బిందె, స్టీల్ బాక్స్ ను అందజేశారు. కార్యక్రమం లో ఐసిడిఎస్ పర్యవేక్షకురాలు, మేజిక్ బస్ ప్రాంతీయి సమన్వయకర్త రమేష్, ఉపాధ్యాయులు వల్లభదాసు బాలాజి తదితరులు పాల్గొన్నారు.

# విజయవాడ వరద ముంపు కాలువలలో పూడిక పనులు వేగవంతం



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** విజయవాడ వరద సహాయక చర్యల్లో భాగంగా వరద ముంపు ప్రాంతంలోని కాలువలలో పూడికలను యుద్ధ ప్రాతిపదికన తొలగించేలా పనులను చేపట్టాలని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ సహాయక చర్యలు చేపడుతున్న జీవీఎంసీ అధికారులను ఆదేశించారని జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ విజయవాడ నుండి గురువారం తెలిపారు.

విజయవాడ 64వ వార్డు కండ్రిక, ఎన్.ఎస్.సి. బోస్ నగర్, ప్రజాశక్తి నగర్, మధురానగర్ తదితర ప్రాంతాలలో కాలువలలోని పూడికలు తొలగింపు, రోడ్లపై, వీధులలో నిల్వవున్న నీటిలో దోమలు వృద్ధి చెందకుండా స్ప్రేయింగ్, ఫాగింగ్ చేయు విధానాన్ని పరిశీలించే చర్యలను మంత్రి ఆదేశాల మేరకు పర్యవేక్షించామని కమీషనర్ తెలిపారు. ఈ సందర్భంగా పురపాలక శాఖ మంత్రి ఆదేశాల మేరకు వరద నీరు తగ్గినందున కాలువలలో పూడికలు తొలగింపు చర్యలు చేపట్టామని, సీజనల్ వ్యాధులు ప్రభలకుండా జాగ్రత్తలు చేపట్టే కార్యక్రమాలను పరిశీలించడమైనదని కమీషనర్ తెలిపారు. అలాగే ఆయా ప్రాంతాలలో ప్రతి కుటుంబానికి నిత్యావసర సరుకులు అందుతున్నాయా అని మంత్రి ఆరా తీశారని కమిషనర్ తెలిపారు.

ఈ కార్యక్రమంలో జివిఎంసి ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్ కుమార్, సహాయక వైద్యాధికారులు డాక్టర్ కిరణకుమార్, డాక్టర్ ఎన్.కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

# మాస్టారు..

పడక కుర్చీలో పడుకుని కళ్ళు మూసుకుని ఉన్నారు విద్యాసాగర్ గారు..

ఆయన రిటైరయ్యి నాలుగేళ్లు అయ్యింది...

స్వస్థలం కర్నూల్ పట్టణం..అక్కడే ఎక్కువకాలం లెక్చరర్ గా పని చేసారు.. ఎన్నో అనుభూతులు... గతం ప్రసాదించిన వరం.. ఆ అనుభూతుల్లోనికి తొంగి చూడటం అలవాటయ్యింది విద్యాసాగర్ గారికి..

ఆయనో పిజిక్స్ లెక్చరర్ ఆ రోజుల్లో.. అప్పుడు ఆయన వయస్సు పట్టుమని ముప్పై ఏళ్ళు లేవు...అప్పటికే సీనియర్ కాలేజీ లెక్చరర్... స్టూడెంట్స్ కి ఇష్టమైన లెక్చరర్ కూడా..

ఆయన పనిచేస్తున్న కాలేజీ ఒక రెసిడెన్షియల్ కాలేజీ..మొత్తం నాలుగు వందల మంది విద్యార్థులు ఉండేవారు..దాదాపుగా తొంభై శాతం విద్యార్థులు నిరు పేదలే...కష్టపడి చదివి, ఎంట్రెన్స్ పరీక్ష వ్రాసి ఉత్తీర్ణులై వచ్చిన వారే అందరూ.. నెలకు వంద రూపాయలు స్టైఫండు ఇచ్చేవారు ప్రతి విద్యార్థికి .. అవి వారి తిండికే సరిపోయేవి...

ఇంకో రెండు రోజుల్లో దసరా పండుగ సెలవులు.. ఆ రోజు రాత్రి పది గంటల తరువాత విద్యార్థులు ఉన్న హాస్టల్ నిరీక్షణకు వెళ్ళారు ఆయన ...ఆ కళాశాల లో పని చేస్తున్న ప్రతి లెక్చరర్ కి అదో ప్రత్యేకమైన డ్యూటీ...

హాస్టల్ లో నలభై గదులున్నాయి. రెండు వందల మంది మాత్రమే హాస్టల్ లో ఉన్నారు..మిగతా రెండు వందల మంది కాలేజీకి దగ్గర్లో ఉన్న కాలనీల లో అద్దెకు ఉండేవారు .హాస్టల్ లో ఖాళీ అయినప్పుడు వచ్చి చేరేవారు..

హాస్టల్ నిరీక్షణకు దాదాపు రెండు గంటల సమయం పట్టేది.. నలభై గదుల్లో ఉన్న విద్యార్థులు ఎలా చదువుతున్నారో చూడాలి ..నిరీక్షణ చేస్తున్న లెక్చరర్..

నిరీక్షణ మొదలయ్యింది ఆ రోజు రాత్రి..

మధ్య మధ్యలో గదుల్లోనికి వెళ్లి విద్యార్థులను పరామర్శించి ముందుకు కదులుతున్నారు..

8 వ నంబర్ రూము.... తలుపులు దగ్గరకు వేసి ఉన్నాయి.. ఏవో మాటలు వినిపిస్తున్నాయి..చదువు కోకుండా ఈ మాటలేమీటీ.. అనుకుంటూనే దగ్గరగా వెళ్లి మాటలు విన్నారు... ఆ తరువాత ముందుకు కదిలారు.. ఒక గంట తరువాత స్కూటర్ స్టార్ట్ చేసి ఇంటికి బయలు దేరారు విద్యాసాగర్ మాష్టారు...

ఆ రోజు రాత్రి చాలా సేపటి వరకూ ఆయనకు నిద్ర పట్టలేదు..

ఎప్పుడో తెల్లవారు ఝామున నిద్ర పట్టింది ఆయనకు...

టైం కి కాలేజీకి వెళ్ళడం ఆయనకు అలవాటు..

మొదటి పీరియడ్ ఫస్ట్ ఇయర్ ఎంపీసీ క్లాసుకి వెళ్ళారు...

పాఠం మొదలు పెట్టే ముందు మామూలుగా అందరినీ అడిగారు.

"దసరా సెలవులు వస్తున్నాయి కదా .. ఈ పది రోజులు ఇంటికి వెళ్ళే వారు ఎందరు ? "

మొత్తం క్లాసులో ముప్పై రెండు మంది విద్యార్థులు ఉన్నారు.. ముగ్గురు తప్పించి అందరూ ఇంటికి వెళ్తున్నామని చేతులు యెత్తారు..చేతులు ఎత్తని ముగ్గురి పేర్లు ఆయనకు తెలుసు..

"హాయిగా సెలవులు గడిపి రండి..కొన్ని రోజులు కాలేజీని మరచి పొండి..."నవ్వుతూ అన్నారు ఆయన..

క్లాసు చెప్పడం మొదలు పెట్టారు..గంటన్నర తరువాత క్లాసు ముగించి స్టాఫ్ రూమ్ కి వెళ్ళారు ఆయన....

ఒక అరగంట తరువాత ప్రిన్సిపాల్ రూం లో ఉన్నారు ఆయన..

"సర్..నిన్న రాత్రి హాస్టల్ విజిట్ కి వెళ్ళాను..ఒక రూం లోనుండి విద్యార్థులు మాట్లాడుకున్న మాటలు విన్నాను.."

"సర్ ! దసరా సెలవులు కొంతమంది పిల్లలకు కష్టం కలిగిస్తున్నాయి.. కొంత మందికి తల్లి దండ్రులు లేరు..ఎవరి పంచనో ఉండి చదువుతున్నారు ఇన్నాళ్లూ..ఇప్పుడు ఇక్కడికి వచ్చారు.. ఈ సెలవుల్లో ఎక్కడికి వెళ్ళాలో వాళ్లకు అర్థం కావటం లేదు ..హాస్టల్ కూడా మూసేస్తున్నాం .. తిండి కూడా ఉండదు పిల్లలకు.. సెలవుల్లో.."

"నాదో రిక్వెస్ట్ సర్ .. హాస్టల్ తెరిచి ఉంచుదాం ..రెండువందల మందిలో కనీసం ఒక ఇరవై మంది హాస్టల్ లోనే ఉండే అవకాశం ఉంది.. వీలయితే మెస్ కూడా ఏర్పాటు చేయాలి మనం...చెప్పడం ఆగారు.. విద్యాసాగర్ గారు..

ప్రిన్సిపాల్ అంతా విని ఆశ్చర్య పోయారు.. "అయ్యో.. ఇన్నాళ్లూ ఈ విషయం నా దృష్టికి ఎవరూ తీసుకు రాలేదు..."బాధ పడ్డారు ఆయన..

ఆలోచనలో పడ్డారు ప్రిన్సిపాల్..కాసేపటి తరువాత తేరుకుని అన్నారు..

"హాస్టల్ తెరిచి ఉంచడం కష్టం కాదు ..మెస్ ఏర్పాటు చేయడం కష్టం.. మెస్ లో పని చేస్తున్న వాళ్లకు సెలవులు ఇచ్చి తీరాలి.. ఏం చేయాలి ? .." ఆలోచనలో పడ్డారు ఆయన..

"అది పెద్ద కష్టం కాదు సర్.. దాదాపు పాతిక మంది లెక్చరర్లము ఉన్నాము..పిల్లలు మా ఇళ్ళల్లో భోజనం చేస్తారు..ఆ సంగతి నేను చూసుకుంటాను..మీరు హాస్టల్ తెరిచే ఉంచి పుణ్యం కట్టుకోండి.." బ్రతిమ లాడారు విద్యాసాగర్ గారు..

"అలాగే ..తప్పకుండా హాస్టల్ తెరిచే ఉంచుదాం...ఇక్కడే ఉండాలనుకునే విద్యార్థులు నిరభ్యంతరంగా ఉండవచ్చు సెలవు రోజుల్లో...వాచ్ మన్లు గా ఒకరిద్దర్ని ప్రత్యేకంగా ఏర్పాటు చేద్దాం...ఇక భోజనాల సంగతి...మా ఇంట్లో కూడా నలుగురికి నేను ఏర్పాటు చేస్తాను .."అన్నారు ప్రిన్సిపాల్..

ఆయనకు నమస్కారం చేసి స్టాఫ్ రూం కి నడిచారు విద్యాసాగర్ గారు..

లంచ్ సమయం లో స్టాఫ్ రూం లో ఉన్న ఆయన దగ్గరకు వచ్చారు ఉదయం ఫస్ట్ ఇయర్ పీరియడ్ లో సెలవులకు ఇంటికి వెళ్ళని ముగ్గురు విద్యార్థులు..

"ఏమిటి ? చెప్పండి .."అడిగారు ఆయన.

ఒక నిముషం మాటలు లేవు..నెమ్మదిగా ఒక విద్యార్థి చెప్పాడు..

"మాకు కూడా ఇంటికి వెళ్ళాలని ఉన్నది ..అమ్మని, నాన్నని చూడాలని ఉంది..అలాగే తమ్ముళ్ళను చెల్లాయిలను కూడా..కానీ వెళ్ళడానికి మా దగ్గర డబ్బులు లేవు .అందుకే మేం ఉదయం చేతులు ఎత్తలేదు సర్..."చెప్పాడు ఒక విద్యార్థి..మిగతా ఇద్దరూ ..అవును సర్...అన్నారు... ఈ విషయం అందరి ముందు చెప్పలేక పోయాం సర్... క్షమించండి...అన్నారు ఆ ముగ్గురూ..

"సరే..మీరు క్లాసుకి వెళ్ళండి....మీతో తరువాత మాట్లాడుతాను.. " అంటూ వాళ్ళను పంపేశారు విద్యాసాగర్ గారు...

పిల్లలు ఇంత కష్ట పడుతూ ఉన్నారా ? సెలవులకు ఇంటికి వెళ్ళడానికి కూడా డబ్బులు లేవా ?ఆయన మనసు ఎంతో బాధ పడింది.. ఏం చేయాలి.. ఏం చేయాలి...

ఆ పిల్లలు ముగ్గురికి ..సెలవులకు ఇంటికి వెళ్ళడానికి ట్రెయిన్ టిక్కెట్లు కొన్నారు...మళ్ళీ రావడానికి, ఖర్చులకు ..ఒక్కొక్కరికి వంద రూపాయలు అదనంగా ఇచ్చారు...విద్యా సాగర్ గారు...

అయినా ఆయన మనసులో ఏదో బాధ...ఇలా విషయం చెప్పకుండా తమలో తాము బాధ పడుతున్న విద్యార్థులు ఎందరో..?

ఆయన మదిలో ఒక ఆలోచన తళుక్కున మెరిసింది....

దసరా , సంక్రాంతి సెలవులకు ..వారం రోజుల ముందు ..విద్యార్థులకు ఫిజిక్స్ సబ్జెక్టు లో పరీక్ష పెట్టేవారు ..వంద మార్కులకు..కనీసం ఎనభై మార్కులు వచ్చిన విద్యార్థులకు ..వంద రూపాయలు నగదు పారితోషికం... అందజేసేవారు.... ఇంకేముంది.... ఫస్ట్ ఇయర్, సెకండ్ ఇయర్ మరియు థర్డ్ ఇయర్ విద్యార్థులకు..ఇలా ఇవ్వసాగారు.. దసరా , సంక్రాంతి పండుగలకు..విద్యాసాగర్ గారు ఇరవై వేలు పైనే ఖర్చు పెట్టేవారు.. ఆ రోజుల్లో.. ఆ కాలేజీలో ఆయన ఉన్న ఐదేళ్ల లో ఇలాగే గడిచింది .ఆయనకు తృప్తిగా ఉంది...ప్రిన్సిపాల్ కూడా మెచ్చుకున్నారు..ఆయన కూడా కొంత సాయం చేసే వారు మిగతా గ్రూప్ విద్యార్థులకు..

ఆ రోజులు గుర్తుకు వచ్చి ..నవ్వుకున్నారు ఆయన..ఆ పిల్లలు ఎలా ఉన్నారో...ఎక్కడ ఉన్నారో... వాళ్ళు కనిపించినా గుర్తు పట్టడం కష్టం..

"కాఫీ తీసుకోండి.. "అంటూ వచ్చింది ఆయన శ్రీమతి..

"దసరా పండుగ వస్తోంది కదా.. మన పని మనిషి పిల్లలకు బట్టలు కొందామా ?" అడిగింది ఆవిడ...

ఆవిడ వంక తదేకంగా చూశారు విద్యాసాగర్ గారు..

"అలాగే..."అంటూ ఆలోచనలో పడ్డారు..

ఒక గంట తరువాత శ్రీమతి కి చెప్పారు... "అలా ..మా కాలేజీ వరకూ వెళ్లి వస్తాను.."

"మీ కాలేజీ ఏమిటి ? మీరేమైనా కట్టించారా ? "నవ్వింది ఆయన శ్రీమతి.. ఆయన కూడా నవ్వారు..

హైదరాబాదు లో డిప్యూటీ డైరెక్టర్ గా రిటైర్ అయ్యారు ఆయన..విద్యా విభాగంలో.. ప్రస్తుతం కర్నూల్ లో సెటిల్ అయ్యారు...

కాలేజీ కి చేరుకుని ..తిన్నగా ఫిజిక్స్ డిపార్ట్మెంట్ కి వెళ్ళారు..అక్కడ ఉన్నవారికి ఆయన తెలుసు..నమస్కారం చేసారు అందరూ... కాసేపు వారితో గడిపి...ప్రిన్సిపాల్ రూం లోనికి అడుగు పెట్టారు ఆయన...

"నమస్కారం ప్రిన్సిపాల్ గారు..నా పేరు విద్యా సాగర్.. ఈ కాలేజీలో ముప్పై ఏళ్ల క్రితం లెక్చరర్ గా పనిచేశాను..ఒకసారి చూసి పోదామని వచ్చాను...." చెప్పారు ఆయన..

ప్రిన్సిపాల్ .. అక్కడున్న మిగతా వాళ్ళు చూస్తూ ఉండగానే .. విద్యాసాగర్ గారి కాళ్ళకు నమస్కారం పెట్టారు...

"సర్...మీరు నాకు తెలుసు....నేను కూడా ఇదే కాలేజీ లో కామర్స్ చదివాను... మీరిచ్చిన వంద రూపాయల్లో సగం నాకిచ్చేవాడు నా రూం మేట్...మీ పేరు చెప్పుకుని మేము సెలవుల్లో ఇంటికి వెళ్ళేవాళ్ళం .."వినయంగా చెప్పారు...ప్రిన్సిపాల్..

విద్యాసాగర్ గారికి ఆశ్చర్యం.. ఎన్ని ఏళ్ల క్రితం మాట... కొన్ని వందల రూపాయల సాయం... అదీ పిల్లలకు.... ఇంకా ఇలా కొంతమంది గుర్తు పెట్టుకోవడం ఆనందంగా ఉంది...

జేబులో నుండి చెక్కు తీశారు...ఇరవై వేల రూపాయలు...వ్రాసి సంతకం చేసి..ప్రిన్సిపాల్ చేతికి అంద జేశారు..

"పిల్లల కోసం ఖర్చు పెడితే సంతోషిస్తాను..."చెప్పారు విద్యా సాగర్ గారు..

"అలాగే సర్...తప్పకుండా.."

"మీరు నేర్పిన బాట లోనే నేను నడుస్తున్నాను.. పండుగల ముందు పరీక్షలు పెట్టి..కొంతమందికి నగదు బహుమతి ఇవ్వడం మొదలు పెట్టాను.. మీరు వెలిగించిన కాగడా ..ఇంకా వెలుగుతూనే ఉంది మాష్టారూ... నా ముందు వాళ్లు కూడా ఇలాగే చేసారు..అవసరం ఉన్న వాళ్లకు ..వాళ్ల ఆత్మాభిమానానికి అడ్డు రాకుండా ..మీరు చేసిన పనిని మేం కొనసాగించాం..

మీకు అభ్యంతరం లేక పోతే అప్పుడప్పుడూ వస్తూ ఉండండి .."వేడుకున్నాడు ..ప్రిన్సిపాల్...

ప్రిన్సిపాల్ తో బాటుగా టీ త్రాగి..తృప్తిగా బయటకు నడిచారు...కాదు..కాదు..కారు వరకూ..దాదాపు అందరు లెక్చరర్లు వచ్చి దిగ బెట్టారు.. ప్రిన్సిపాల్ కారు డోర్ తీసి పట్టుకుని.. అన్నాడు.. "మమ్మల్ని ఆశీర్వదించండి మాష్టారూ.."

విద్యాసాగర్ గారికి..కళ్ళల్లో నీళ్ళు ఉబికాయి...ప్రతి జన్మ లో ఉపాధ్యాయుడుగా పుట్టాలని కోరుకు న్నారు .. దేవుణ్ణి..

"మీకోసం ఆయన ఎవరో వచ్చారు.... ఇంకో గంట లో వస్తానని వెళ్ళారు...ఏదో పేరు చెప్పారు...ఆ.. సుబ్బారావు గారట....పెద్ద రైల్వే ఆఫీసర్ లా ఉన్నారు ఆయన. .." చెప్పింది ఆయన శ్రీమతి..

ఎవరో సుబ్బారావు...గుర్తుకు రాలేదు విద్యాసాగర్ గారికి..

ఇంకో అరగంట లో వచ్చారు ఆ సుబ్బారావు గారు

షరా మామూలే ...వచ్చిన సుబ్బారావు గారు ఆయన కాళ్ళకు నమస్కరించడం ...

వచ్చిన సుబ్బారావు గారు చెప్పారు ..

"ముప్పై ఏళ్ళ క్రితం.. ఒక మధ్యాహ్నం..మీ రూం కి వచ్చిన ముగ్గురిలో నేను ఒకడిని మాష్టారూ.. అప్పుడు మీరు ట్రెయిన్ టికెట్ కొనిపెట్టి..వంద రూపాయలు డబ్బులు ఇచ్చారు ఇంటికి వెళ్ళడానికి..

ఈ రోజున ..అదే రైల్వేలో ..రైల్వే బోర్డు మెంబరుగా పని చేస్తున్నాను... అంతా మీ చలవే..వినయంగా చెప్పాడు..సుబ్బారావు..

ఎంతో సంతోష పడ్డారు విద్యాసాగర్ గారు... సుబ్బారావు ని దీవించి పంపారు ..విద్యాసాగర్ గారు..అతను తెచ్చిన స్వీట్ ని తిన్నారు అప్యాయంగా...

ఆ రుచి గొప్పగా ఉంది ఆయనకు.... అలా ఎప్పుడూ అనిపించలేదు ..

ఆయనకు బాగా నిద్ర పట్టింది ఆ రాత్రి..నిద్రలో వెలుగుతున్న కాగడా ...కనిపిస్తూనే ఉంది..సంతోషంగా ట్రెయిన్ లో వెళుతున్న విద్యార్థులు కూడా కనిపించారు..కలలో.. మాష్టారు గా విద్యను అందరూ బోధిస్తారు...విద్యార్థుల అవసరాల ను గుర్తించి ఆదుకునే ..విద్యాసాగర్ లాంటి కూడా మాస్టార్లు అరుదుగా ఉంటారు...చేసిన సాయం బయటకు చెప్పడం వారికి ఇష్టం ఉండదు....వారే నిజమైన మాష్టార్లు....విద్యా సాగరులు..

# స్టీల్‌ప్లాంటు రక్షణకై ఈ 15న మహాధర్నాను జయప్రదం చేయండి




విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): మోడీ ప్రభుత్వం విశాఖ స్టీల్‌ప్లాంట్ విధ్వంసాన్ని ఆపి సెయిల్‌లో విలీనం చేయాలని, టిడిపి, జనసేన కూటమి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి స్టీల్‌ప్లాంట్ రక్షణకు పూనుకోవాలని విశాఖ ఉక్కును సెయిల్‌లో విలీనం చేయాలి, ప్లాంటుకు స్వంతగనులు, వర్కింగ్ కేపిటల్ ఇవ్వాలని, ప్లాంటును పూర్తి ఉత్పత్తి సామర్థ్యంతో నడిపించాలని. ఉద్యోగ ఖాళీలు భర్తీ చేయాలని. నిర్వాసితులకు ఉద్యోగాలివ్వాలని, అధికారులు, పర్మినెంటు, కాంట్రాక్టు కార్మికులందరికీ సకాలంలో జీతాలివ్వాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 15న పాత గాజువాకలో జరిగే మహాధర్నాను విజయవంతం చేయాలని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు విజ్ఞప్తి చేసారు. మహాధర్నా పోస్టర్‌ను నేడు సిఐటియు జిల్లా కార్యాలయంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డా?బి.గంగారావు, బి.పద్మ, బి.ఈశ్వరమ్మ, బి.జగన్ లతో కలసి విడుదల చేసారు. ఈ సందర్భంగా ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ..

మాకు అధికారం ఇవ్వండి. స్టీల్‌ప్లాంట్ అమ్మకం జరగదు. ప్రభుత్వ రంగంలో మరింత బలోపేతం చేస్తాం. ఇది మా బాధ్యతని ఇటీవల జరిగిన పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల్లో కేంద్ర బిజెపి, రాష్ట్ర టిడిపి, జనసేన కూటమి ప్రజలకిచ్చిన వాగ్దానం చేసాయి. దీనిని స్టీల్‌ప్లాంటు కార్మికులు, ప్రజలు నమ్మారు. రాష్ట్రంలో ఎక్కడా లేనంతగా విశాఖ ఎంపి,గాజువాక ఎమ్మెల్యేతో సహా విశాఖ ఎమ్మెల్యే స్థానాలన్నింటిలోను ప్రజలు భారీ మెజారిటీలతో టిడిపి కూటమి అభ్యర్థులను గెలిపించారు. వీరు గెలిచి పదవీ ప్రమాణం చేసిన తరువాత స్టీల్‌ప్లాంటు గురించి చేసిన ప్రకటనలు, కేంద్ర ఉక్కు శాఖా మంత్రి హెడ్.డి.కుమారస్వామి గారు విశాఖ ఉక్కు పర్యటన, హామీలు కార్మికులకు, ప్రజలకు నమ్మకం కలిగించాయి. కానీ ఆచరణలో ప్లాంట్‌ను ఆగాధంలోకి నెట్టే చర్యలు కేంద్రం చేపబడుతుంటే టిడిపి కూటమి కేంద్రాన్ని నిలదీయకపోవడం ప్రజల ఆశలను వమ్ముచేయడమే అన్నారు.

స్టీల్ ప్లాంటులో 3బ్లాస్ట్ పర్నేస్‌లున్నాయి. రోజుకి 21వేల టన్నుల వీటి ఉత్పత్తి సామర్థ్యం.కానీ నేడు 5వేల టన్నులు మాత్రమే

ఉత్పత్తి అవుతోంది. కారణం! దీనికి కావలసిన ఇనుప ఖనిజం, బొగ్గు పూర్తి స్థాయిలో సరఫరా కాకుండా కేంద్రం అడ్డుకుంటోంది. 2 పర్నేస్ లు ఉత్పత్తి ఆపేసారు.దీనివలన ఉత్పత్తి నిలిచిపోవడమేకాక సంస్థలోని బ్యాటరీలు, ఇతర విభాగాలు,యంత్రాలకు అపార నష్టం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేసారు.

స్టీల్‌ప్లాంట్‌కు 536.6 మెగావాట్ల విద్యుత్తును ఉత్పత్తి చేయగల సామర్థ్యం ఉంది. స్టీల్ ప్లాంటు నడవడానికి 315 మెగావాట్లు విద్యుత్ సరిపోతుంది.మిగతా మిగులు విద్యుత్తును ప్లాంటు బయట విక్రయించేది. బొగ్గు, ముడిసరుకు లేక 120 మెగావాట్లు విద్యుత్ మాత్రమే నేడు ఉత్పత్తి అవుతోంది. ఫలితంగా ప్రతినెల ప్లాంటు 45 నుండి 80కోట్లు రూ?లు వరకు ఏపీ ఈపీడీసీఎల్ దగ్గర విద్యుత్ కొనాల్సిన దుస్థితిని కేంద్రం కల్పించిందన్నారు.

స్టీల్‌ప్లాంటు ఏర్పాటుకు నాటి కేంద్ర ప్రభుత్వం పెట్టిన పెట్టుబడి 4890కోట్లు. ప్రతిఫలంగా స్టీల్‌ప్లాంటు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు ఇంతవరకు 54 వేల కోట్ల రూ?లు పన్నులు, డివిడెంట్లు రూపంలో చెల్లించింది. ప్లాంట్ ఆర్థిక కష్టాల్లో ఉంది. 10వేల కోట్లు వర్కింగ్ కేపిటల్ ఇవ్వండి. లేదా కేంద్రం మధ్యవర్తిగా ఉండి బ్యాంకుల ద్వారా రుణం ఇప్పించండి. సంస్థలను పూర్తిస్థాయి సామర్థ్యంతో నడిపించండి.సంవత్సరం తిరగక ముందే సంస్థను లాభాలు బాట పట్టిస్తామని ప్లాంటు ఉద్యోగులు,కార్మికులు చెబుతున్నా మోడీ ప్రభుత్వం ఖాతరు చేయకపోవడం దుర్మార్గమన్నారు. దేశంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటురంగ స్టీల్‌ప్లాంట్లకు కేంద్రం సొంతగనులు కేటాయించింది. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు మాత్రం కేటాయించడంలేదు. దీనివలన ప్రతి టన్ను ఉక్కు ఉత్పత్తికి 4వేల రూ?లు పైబడి అదనపు ఖర్చు అవుతోంది. మన స్టీల్‌ప్లాంట్ నష్టాలకు ఇది ప్రధాన కారణంగా ఉంది.

స్టీల్‌ప్లాంట్ లో 19వేల మంది ఉద్యోగులకు బదులు 12700మంది ఉన్నారు. 2025 చివరికి వీరిలో 1400మంది రిటైర్ అయిపోతారు. మరో 2500మందిని విఆర్‌ఎస్ పేరుతో బయటకు పంపేయాలని, నైపుణ్యత పేరుతో 500 మందిని ఛత్తీస్‌ఘడ్‌లోని నగర్‌నార్ ఉక్కు పరిశ్రమకు బదిలీ చేయాలని కేంద్రం కుట్రలు ఆపాలని డిమాండ్ చేసారు.

ఆఫీసర్ల జీతాల్లో 30శాతం కోతకోసారు. పర్మినెంట్ కార్మికులకు నెలలో ఒకేసారి జీతం ఇవ్వడంలేదు. కార్మికుల జీతాల్లో కట్‌చేసిన 64కోట్ల రూ?లు సొసైటీకి జమచేయలేదు. కాంట్రాక్టు కార్మికులకు నెల నుండి 4 నెలలుగా జీతాలు ఇవ్వడంలేదు. కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించడంలేదు. ఇలా అన్ని రూపాల్లోను స్టీల్‌ప్లాంటును,కార్మికులను బిజెపి ప్రభుత్వం అగాధంలో నెడుతోంది.

జూలై 11న కేంద్ర ఉక్కు మరియు భారీ పరిశ్రమల శాఖామంత్రి హెచ్‌డి కుమారస్వామి, బిజెపి మంత్రి, విశాఖ ఎంపి ఎం.శ్రీభరత్, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావులు ప్లాంటులో పర్యటించారు. స్టీల్‌ప్లాంటు అమ్మకం జరగదు. ఇది ప్రజల సెంటిమెంట్‌తో కూడినది. ప్రధాని మోడీతో మాట్లాడి 45 రోజుల్లో దీని అభివృద్ధికి ప్రణాళిక సిద్ధం చేస్తామని మంత్రి ప్రకటించారు. రెండు నెలలు పైగా గడిచిపోయింది.అతీగతీలేదు. ఈ నెల 11న కేంద్ర ఉక్కు మంత్రిత్వ శాఖ సమావేశం జరిగితే 12న స్టీల్‌ప్లాంట్ మూడవ బ్లాస్ట్ ఫర్నేస్‌ను షట్‌డౌన్ చేసారు. స్టీల్‌ప్లాంట్‌ను రోజు రోజుకీ కేంద్రం దెబ్బతీస్తోంది. మోడీ ప్రభుత్వ పాలనకు టిడిపి, జనసేనలు ఆక్సిజన్ అందిస్తున్నాయి. రాజకీయంగా ఇంతటి అనుకూల పరిస్థితి గతంలో లేదు. అయినా మోడీ ప్రభుత్వాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లు ఎందుకు నిలదీయడంలేదు. స్టీల్‌ప్లాంట్‌ను కాపాడటం కన్నా రాష్ట్ర ప్రయోజనం వీరికి ఏముందని ప్రశ్నించారు.

ఇప్పటికైనా కేంద్ర బిజెపి ప్రభుత్వం విశాఖ ఉక్కు ధ్వంసాన్ని ఆపి సెయిల్‌లో విలీనం చేయాలి. రాష్ట్ర టిడిపి, జనసేన కూటమి ఇందుకు చిత్తశుద్ధితో కేంద్రంపై ఒత్తిడి తేయాలి. విశాఖ ప్రజాప్రతినిధులు తమ అధినాయకత్వాలపై ఒత్తిడి తెచ్చి స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు పూనుకోవాలి. తద్వారా తమను నమ్మి ఓట్లు వేసి గెలిపించిన స్టీల్‌ప్లాంట్ ఆఫీసర్లు, పర్మినెంట్ కాంట్రాక్ట్‌లు, కార్మికులు, విశాఖ ప్రజల పక్షాన నిలవాలని డిమాండ్ చేసారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చి ప్లాంటు రక్షణకు స్టీల్ ఉద్యోగులు, కార్మికులు, నిర్వాసితులు, ప్రజలు ఆందోళన తీవ్రతరం చేయాలని , సిపిఎం పార్టీ ఈనెల 15న ఉ?9గం?కు పాతగాజువాక జంక్షన్‌లో జరిపే మహాధర్నాలో పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేసారు.

## వైభవంగా గణేష్ శోభాయాత్ర



విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): హరిద్ర గణపతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బాల గణపతికి ప్రజలు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించి ఘనంగా వీడ్కోలు పలికారు.. జీవీఎంసీ,7వ వార్డు ట్రైలర్స్ కాలనీలో హరిద్ర గణపతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపంలో కొలువుదీరిన గణనాథునికి గత ఐదు రోజులుగా విశేష పూజలు నిర్వహించారు. వైభవంగా శోభాయాత్ర నిర్వహించి నిమజ్జనం చేశారు. ముందుగా నిమజ్జన కార్యక్రమంతో సాంస్కృ తిక కార్యక్రమాలు,కోలాటం నిర్వహించారు. లడ్డూ పాట నిర్వహించి లడ్డు దక్కించుకున్న బంగారు అశోక్ కుమార్,ఝాన్సీ దంపతులను ఘనంగా సత్కరించి స్వామి వారి ప్రసాదాన్ని అందజేశారు. అనంతరం రుషికొండ బీచ్ లో గణనాధుడిని నిమజ్జనం చేశారు.ఈ కార్యక్రమంలో హరిద్ర గణపతి ఉత్సవ కమిటీ నిర్వాహకులు బంగారు అశోక్ కుమార్,బంగారు ఝాన్సీ, తెంటు మాధవి,బంగారు ప్రకాశ్, వట్టికుల నాగమ్మ,నవగాని శరత్, బలగ ఈశ్వరావు, నీలాపు సూర్యనారాయణ బెల్లాల ఈశ్వరరావు(చంటి) తదితరులు పాల్గొన్నారు.

## జీవో నెంబర్ 115 రద్దు చేయాలి



విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): రాష్ట్రంలో ఏఎన్ఎంలుగా పనిచేస్తున్న వారికి జిఎన్ఎమ్ సెక్షన్ ఇచ్చి స్టాఫ్ నర్స్ ఉద్యోగాలును కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబర్ 115 ను తక్షణమే రద్దు చేయాలని విశాఖ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ స్టాఫ్ నర్సులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం విమ్స్ ప్రధాన గేటు వద్ద స్టాఫ్ నర్సులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఇంచార్జ్ స్టాఫ్ నర్స్ జయ రాజు మాట్లాడుతూ నాలుగేళ్లు కష్టపడి నర్సింగ్ చదువుకున్న తమకు ఈ జీవో నెంబర్ 115 వల్ల తీవ్ర నష్టం వాటిల్లుతుందన్నారు.. 2010 నుంచి ఆంధ్రప్రదేశ్ లో రెగ్యులర్ పోస్టులను భర్తీ చేయలేదని ఇప్పుడు నేరుగా ఏఎన్ఎంలను రెగ్యులర్ పోస్టు కింద భర్తీ చేసి తమకు అన్యాయం చేయొద్దని కోరారు.. జీవో నెంబర్ 115 వలన నర్సింగ్ వ్యవస్థ కుంటుపడే అవకాశం కూడా లేకపోలేదు అన్నారు.. అలాగే పక్క రాష్ట్రాల్లో కాంట్రాక్ట్ స్టాఫ్ నర్స లను రెగ్యులర్ చేయడం జరిగిందని తమను కూడా రాష్ట్ర ప్రభుత్వం రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు.. జీవో నెంబర్ 115 రద్దు చేసే అంతవరకు తమ నిరసన కార్యక్రమాలు కొనసాగుతాయని తెలిపారు.. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ స్టాఫ్ నర్సులు భారతి, భారత్, శాంతి, శ్రావణి, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

## మాస్ వినియోగదారులు తమ ఆన్‌లైన్ షాపింగ్ బడ్జెట్‌లను విస్తరించడానికి సిద్ధంగా ఉన్నారు




విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): భారత దేశపు ఏకైక నిజమైన ఈ-కామర్స్ మార్కెట్‌ప్లేస్ అయిన మీషో ఈ రోజు తన 'ఈ-కామర్స్ పండుగ సూచన 2024'ని విడుదల చేసింది. పండుగ సీజన్‌కు ముందు, ఈ సూచన విక్రేత సంసిద్ధత యొక్క వివరణాత్మక విశ్లేషణ మరియు రాబోయే పండుగ సీజన్‌లో వినియోగదారులు ఎలా షాపింగ్ చేయాలనే దాని గురించి అంతర్దృష్టులను అందిస్తుంది. సమగ్ర నివేదిక ఆన్‌లైన్ పండుగ షాపర్‌ల అభివృద్ధి చెందుతున్న ప్రాధాన్యతలను మరియు ఈ పండుగ సీజన్‌లో తమ అవకాశాలను విస్తరించడానికి ఇ-కామర్స్ విక్రేతలు అనుసరించిన వ్యూహాలను పరిశీలిస్తుంది.

మీషో బిజినెస్ జనరల్ మేనేజర్ మేఘా అగర్వాల్ మాట్లాడుతూ, "మేము పండుగల సీజన్‌ను సమీపిస్తున్నందున, మీషో యొక్క 'ఈ-కామర్స్ పండుగ సూచన 2024' వినియోగదారు మరియు విక్రేత డైనమిక్‌లను మార్చే శక్తివంతమైన ప్రకృతి దృశ్యాన్ని వెల్లడిస్తుంది. మా వినియోగదారులలో ఎక్కువ మంది తమ ఆన్‌లైన్ వ్యయాన్ని పెంచుకోవాలని చూస్తున్నప్పటికీ, సోషల్ మీడియా షాపింగ్‌ను ఎలా రూపుదిద్దుకుంటుందనేది ఆకర్షణీయంగా ఉంది-మా వినియోగదారులలో సగం మంది ఇప్పుడు ఉత్పత్తి సిఫార్సుల కోసం ఇన్‌ఫ్లుయెన్సర్‌ల వైపు మొగ్గు చూపుతున్నారు.

## విశ్వకర్మ జయంతి పోస్టర్ ఆవిష్కరించిన మంత్రి



విజయవాడ, (విశాఖ సమాచారమ్): ఆంధ్రప్రదేశ్ విజయవాడలో సెప్టెంబర్ 17న జరగనున్న విశ్వకర్మ జయంతి జనసేన హారతి కార్యక్రమం వాల్ పోస్టర్లు నీ ఆంధ్రప్రదేశ్ మైనింగ్ మరియు ఎక్సైజ్ శాఖ మాత్యులు శ్రీ కొల్లు రవీంద్ర గారు తన క్యాంపు కార్యాలయంలో విశ్వకర్మ జయంతి జలసేవా హారతి2024 చైర్మన్ శ్రీ ధనాలకోట శ్రీనివాసరావు వాసు (వాసు) గార్లు కలిసి ఆవిష్కరించారు. విజయవాడ పున్నమి ఘాట్ లో జరిగే ఈ కార్యక్రమానికి భక్తులు పాల్గొని విజయవంతం చేయవలసిందిగా కార్యక్రమాన్ని శ్రీ కొల్లు రవీందర్ గారు పిలుపునిచ్చారు.

2024 విశ్వకర్మ జలసేన హారతి చైర్మన్గ స్వర్ణకార వృత్తిలో కోహినూరు వజ్రం ధనాలకోట శ్రీనివాసరావు వాసు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విజయవాడకి జాతీయ స్థాయిలో ఖ్యాతి తెచ్చిన స్వర్ణ కళాకారుడు ధనాలకోట శ్రీనివాసరావు వాసు గారిని ఆంధ్రప్రదేశ్ స్వర్ణకార సంఘం అధ్యక్షుడు విశ్వకర్మ జల సేవా హారతి వ్యవస్థాపకుడు కర్రి వేణు మాధవ్ ఒక ప్రకటనలో తెలియజేశారు కేంద్రంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ప్రత్యేకంగా విశ్వకర్మ కౌశల్య యోజన పథకాన్ని 21-03-2023 పెట్టే ముందు 12 మంది ప్యానెల్ కమిటీలో ఢిల్లీ లో విజయవాడ నుంచి ఒకరిగా హాజరు ఎర్రకోట మీద జెండా వందనం 2023 ఆగస్టు 15 ప్రధానమంత్రి గారిచే ఆహ్వానం పొందిన ధనాల కోట శ్రీనివాసరావు (వాసు) వారి తారకేశ్వరి దంపతులు అలాగే సెప్టెంబర్ 17 2023న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రారంభించిన విశ్వకర్మ కౌసల్య యెజన రకం ప్రారంభోత్సవానికి ప్రత్యేకంగా ఆహ్వానించిన పీఎంఓ కార్యాలయం వీటన్నిటికీ కారణమైన విశ్వకర్మ గోల్డ్ స్మిత్ ప్రైవేట్ లిమిటెడ్ సెంట్రల్ గవర్నమెంట్ క్లస్టర్ నిర్వహణలో నిజాయితీ నిబద్ధత సక్సెస్ చూపించి దక్షిణ భారతదేశంలోనే కాక దేశవ్యాప్తంగా విశ్వకర్మ గోల్డ్ స్మిత్ ప్రైవేట్ లిమిటెడ్ కి ప్రభుత్వం వారిచే అనేక ప్రశంసలు అవార్డులు పొందిన ధనాలకోట శ్రీనివాసరావు వాసు గారిని ఆంధ్రప్రదేశ్ విశ్వకర్మ జయంతి జల సేవా హారతి కార్యక్రమానికి 9వ సంవత్సరం 2024 చైర్మన్ గా ప్రకటించి ఈరోజు ఆంధ్రప్రదేశ్ మంత్రివర్యులు కొల్లు రవీంద్రచే విశ్వకర్మ జయంతి జల సేవా హారతి పోస్టర్ నీ ఆవిష్కరించడం జరిగింది ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధికార ప్రతినిధి ఢిల్లీ వ్యవహారాల ఇంచార్జ్ కర్రి వేణుమాధవ్ విశ్వకర్మ గోల్డ్ స్మిత్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు టేకీ వెంకటేశ్వరరావు కణీతి శ్రీనివాసరావు ఆంధ్రప్రదేశ్ స్వర్ణకార సంఘం అధికార ప్రతినిధి పి సాయికిరణ్ ఆంధ్రప్రదేశ్ బిజెపి విశ్వకర్మ కౌన్సిల్ యోజన కన్వీనర్ కర్రి రాఘవ మరియు పెద్దలు పాల్గొన్నారు.

## మైనారిటీ హక్కుల పరిరక్షణకు కృషి చేయాలి



విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): మైనారిటీ అంటే ముస్లిమ్స్ మాత్రమే కాదని వెనుకబడిన కులాల సంక్షేమనికి కృషి చేస్తామని రాష్ట్ర మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షులు మహ్మద్ అస్లం ఖాను స్పష్టం చేశారు. గురువారం ఉదయం చిన వాల్తేరు తమిళ్ స్ట్రీట్ లోని 21 వ వార్డు సమితి కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అస్లిం ఖాన్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ బీసీ, మైనార్టీ వర్గాలు అనేక ఇబ్బందుల్ని ఎదుర్కొంటున్నాయని వారి సమస్యల పరిస్కారానికి ముందుంటామన్నారు. ప్రముఖ సంఘ సేవకులు, సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి మహ్మద్ గౌస్ మాట్లాడుతూ రాజకీయాలకు అంతీతంగా సేవలందిస్తామని, విజయ వాడలో భారీ వరద భాధితులకు సమితి ద్వారా భోజనాలు, నిత్యావసర సామాగ్రి అందజేశామని తెలిపారు.

కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది సలీం, కళా సంస్థల ప్రతినిధి చెన్నా తిరుమలరావు, దళిత సంఘాల నాయకులు నీలాపు వెంకటరావు, రైల్వే ప్రసాద్ లతో పాటు ఇతర కులాల నాయకులు పాల్గొన్నారు.

## ఆదివారంహంగామా! భోళా శంకర్, మేఘసందేశం-పడమటిసంధ్యారాగం మహాసంగమం, డ్రామాజూనియర్స్ సీజన్ 7 గ్రాండ్ ఫినాలే పార్ట్ 1.. మీ జీ తెలుగులో మాత్రమే!





విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): తెలుగుప్రేక్షకులకు ఇరవై నాలుగు గంటలు నాన్స్టాప్ వినోదం అందించే జీ తెలుగు ఈ ఆదివారంమరిన్ని ప్రత్యేక కార్యక్రమాలతో అలరించేందుకు సిద్ధమైంది. థియేటర్లలో విడుదలై ప్రేక్షకులను ఆకట్టుకున్న మెగా సినిమా 'భోళా శంకర్' ను వరల్డ్ప్రీమియర్ గా ఈ ఆదివారం అందిస్తోంది. అంతేకాదు చిన్న పిల్లల్లోని టాలెంట్నిప్రోత్సహిస్తూ వారి భవిష్యత్తుకు బాటలు చూపే సక్సెస్ఫుల్ రియాలిటీ షో డ్రామాజూనియర్స్ సీజన్ 7 తుది అంకానికి చేరుకుంది. ఆలోచింపజేసే స్కిట్స్, చిచ్చర పిడుగుల ప్రదర్శనతో అద్యంతం ఆసక్తికరంగా సాగిన డ్రామా జూనియర్స్సీజన్ 7 గ్రాండ్ ఫినాలే రెండు భాగాలుగా ప్రసారం కానుంది. మెగాస్టార్ చిరంజీవి, తమన్నా, కీర్తి సురేష్ నటించిన భోళా శంకర్ సెప్టెంబర్ 15, ఆదివారం మధ్యాహ్నం 2:30 గంటలకు మరియు డ్రామా జూనియర్స్ సీజన్ 7 గ్రాండ్ ఫినాలేపార్ట్ 1 రాత్రి 9గంటలకు, జీతెలుగులో మాత్రమే. జీ తెలుగు అందిస్తున్న ఆదివారం హంగామా మెగాస్టార్ మెగామూవీ భోళా శంకర్ వరల్డ్ టెలివిజన్ ప్రీమియర్తో ప్రారంభం కానుంది. ఈ సినిమా కథశంకర్(చిరంజీవి) అనే టాక్సీ డ్రైవర్, అతని చెల్లెలు మహాలక్ష్మి (కీర్తి సురేష్) పాత్రలే ప్రధానంగా సాగుతుంది.

## 84వ వార్డులో జోనల్ కమిషనర్ పర్యటన



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): స్థానిక 84 వ వార్డులో ఇటీవల తుఫాను వల్ల కురిసిన వర్షాలు కారణంగా గ్రామాల్లో కాలువలు పూడిక పోవడంతో రోడ్లపై వర్షం నీరు రావడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారని, అలాగే కొత్తూరు నరసింహారావు పేట నుండి కొప్పాక వరకు డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో రోడ్లపై నీరు నిలకడగా ఉండిపోవడంతో వాహనాలతో పాటు ప్రజలు ఇబ్బంది పడ్డారని84 వార్డ్ ఇంచార్జ్ మాదంశెట్టి నీలబాబు తెలిపారు. గురువారం జోనల్ కమిషనర్ అయ్యప్ప నాయుడు ఇంజనీరింగ్ అధికారులతో కలిసి సాలాపువానిపాలెం, సిరసపల్లి, కొత్తూరు నరసింహారావు పేట, కొప్పాక గ్రామాల్లో పర్యటించి జోనల్ కమిషనర్ కి ఇంజనీరింగ్ అధికారులకు ఇంటర్నల్ రోడ్ల గురించి కాలువల గురించి నీలబాబు పర్యవేక్షణలో అధికారులు దృష్టికి పలు సమస్యలను తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ అయ్యప్పనాయుడు మాట్లాడుతూ తక్షణం సదరు సమస్యలపై ఈ ఈ, ఏఇ సమస్యలపై ఎస్టిమేట్లు తయారు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సాలాపు మోహన్ సాలపు మోహన్ సిరసపల్లి సన్యాసిరావు ఎస్ రాజు జి సురేష్ కసిరెడ్డి సత్యనారాయణ సిహెచ్ దుర్గాప్రసాద్ వానపల్లి బాబురావు గోపి తదితరులు పాల్గొన్నారు..

## విపత్కర పరిస్థితుల్లో అండగా ఉన్నవారందరికీ నా ధన్యవాదాలు : ఎంపీ శ్రీభరత్



విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): విజయవాడలో వరదల వల్ల తీవ్రంగా నష్టపోయిన ప్రజలకు సహాయం అందించేందుకు వివిధ వ్యాపారవేత్తలు, ప్రజా సంఘాలు ముఖ్యమంత్రి సహాయనిధికి అందజేసిన చెక్కులను ఈరోజు కలెక్టర్ హరేంద్ర ప్రసాద్‌కు విశాఖపట్నం ఎంపీ శ్రీభరత్ అందజేశారు.

ఈ సందర్భంగా ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ, "ఇలాంటి విపత్తుల సమయంలో బాధితులకు అండగా నిలుస్తున్న ప్రతి ఒక్కరి సహకారం అభినందనీయం. మనం అందరం కలిసి సహకరిస్తేనే బాధితులకు మనస్ఫూర్తిగా సహాయం అందించగలం," అని పేర్కొన్నారు.

విజయవాడ ప్రజలకు ఆర్థికంగా సాయం చేసిన వ్యాపారవేత్తలు, సంస్థల ప్రతినిధులకు ఎంపీ కృతజ్ఞతలు తెలిపారు.

# అనకాపల్లి జిల్లాలో " అభ్యుదయ రచయతల సంఘము ( అ.ర.స.ము..)



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** స్థానిక శాఖవీధి , ప్రభుత్వ శాఖా గ్రంధాలయములో నూతన జిల్లా అయిన అనకాపల్లి జిల్లాలో కూడా అరసము జాతీయ స్థాయి కార్యవర్గం సూచన మేరకు

" అనకాపల్లి జిల్లా అభ్యుదయ రచయతల సంఘము, ( అ.ర.స.ము..) ను ఏర్పాటు చేశారు. గ్రంధాలయము లో జరిగిన ఈ అరసము జిల్లా సంఘమును అరసము రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరి ప్రసాద్ ప్రారంభించి , అనకాపల్లి జిల్లా అభ్యుదయ రచయితల సంఘము ( అరసము..) కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారముగావించారు.ఈ కార్యక్రమం లో ముందుగ ప్రముఖ రచయుత గరిమెళ్ల సత్యనారాయణ రచించిన " కవితా స్రవంతి " పుస్తకమును ఎ.ఎమ్.ఏ.ఎల్.కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ గల్లా జయబాబు ఆవిష్కరించారు. తదుపరి అరసముజాతీయ అధ్యక్షులు , పెనుగొండ లక్ష్మీ నారాయణ , అరసము రాష్ట్ర నిర్వాహక కార్యదర్శి జి.ఎస్.చలము , అరసము రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరి శివప్రసాద్ అతిధులుగా పాల్గొని మాట్లాడుతూ నూతన జిల్లా అయిన అనకాపల్లి జిల్లాలో ఈ అభ్యుదయ రచయుతుల సంఘము ఏర్పాటు గావడము ఎంతో సంతోషించ దగ్గ విషయమని అంతే గాక అనకాపల్లి జిల్లాలో ఎంతో మంది ప్రముఖ కవులకు, కళాకారులకు, నిలయమని అటువంటి అనకాపల్లి జిల్లాలో నూతనంగా అభ్యుదయ రచయితల సంఘం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అంతే గాక ఈ అరసము జిల్లా సంఘములో యువత కూడా ముందుకు వచ్చి ఈ సంఘము లో చేరి ఈ జిల్లా అరసము సంఘాన్ని ముందు తరాల వారికి మార్గదర్శకంగా ఉండేలా ముందుకు తీసుకు వెళ్లాలని సూచించారు.ఈ కార్యక్రమము లో విశిష్ట అతిధి. గా తెలుగు బాషా సంఘము అధ్యక్షులు కె.రామమోహన రావు మాట్లాడుతూ అనకాపల్లి జిల్లాలో కూడా ఈ అరసము కార్యవర్గము ఏర్పాటు గావడము ఎంతో హర్షించ దగ్గ విషయమని ఈ సంఘము ద్వారా కవులు,కళా కారులు మరింతగా ముందుకు సాగి సమాజానికి మంచి నిర్దేశాన్ని అందించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో అరసము నూతన జిల్లా అధ్యక్షులు జి.ఎల్.ఎస్.శాస్త్రి అధ్యక్షులుగా వ్యవహ రించగా, అరసము నూతన జిల్లా ప్రోగ్రామ్ చైర్మన్ గా సిద్దార్థ సోషల్ సర్వీస్ & కల్చరల్ అసోసియేషన్,అధ్యక్షులు బల్లా నాగ భూషణం వ్యవహరించారు. అతిధులకు చిరు సత్కారం గావించారు.ఈ కార్యక్రమం లో అరసము జిల్లా నూతన కార్యవర్గ సభ్యులు, గ్రంధాలయ అధికారి కె.శ్రీనివాసరావు, కవులు, కళాకారులు, మరియు గ్రంధాలయ పాఠకులు పాల్గొన్నారు..

అనకాపల్లి జిల్లా అరసము నూతన కార్యవర్గ సభ్యులు. జి.ఎల్.ఎస్. శాస్త్రి.. బల్లా నాగ భూషణం.. పెతకముశెట్టి ఆది కోటి..పెనుమత్స క్రిష్ణమురాజు.. బొమ్మాడ నరశింహారావు.. జి.ఎస్.కె.సాయిబాబా.. గంపాశ్రీ దేవి..డా..జామి అప్పల రాజు.. శిష్టా ప్రకాష్.. ఎమ్.వెంకట రమణమ్మ కనుమూరి హైమా.. రాయవరపు సరస్వతి. గెల్లా జయబాబు ( గౌరవ అధ్యక్షులు ) కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు.

# జగన్ జైలు యాత్ర లో అవాకులు చవాకులు : కొణతాల వెంకటరావు



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** జగన్ జైలు యాత్ర సందర్భంగా నందిగం సురేష్ అరెస్టుపై మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని, బుడమేరు గేట్లు ఎత్తివేయడంతో 60 మంది చనిపోయారని జగన్ రెడ్డి ఆరోపణలు చేస్తున్న జగన్తో ది నాలుక తాటిమట్ట అని తెలుగుదేశం పార్టీ అనకాపల్లి పార్లమెంట్ మీడియా కోఆర్డినేటర్ కొణతాల వెంకటరావు జగన్ పై విరుచుకుపడ్డారు. జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఒక బహిరంగ సభలో తెలుగుదేశం జాతీయ అధికార ప్రతినిధి పట్టాభి బోసిడి కి అన్నందుకు వైయస్సార్సీపి సభ్యులకు బీపీ వస్తే తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయం పై ఎందుకు దాడి చేయరు అని ఆనాడు జగన్ రెడ్డి ప్రశ్నించారని, చేసిన నేరపూరితమైన చర్యలను ఖండించవలసిన జగన్ సమర్ధించారని, ఆనాడు పోలీసులను అడ్డం పెట్టుకొని తూతూ మంత్రంగా కేసులు నమోదు చేసి వదిలివేసారని ప్రభుత్వం మారడంతో నేరం చేసిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటే నేడు జగన్ రెడ్డి గగ్గోలు పెడుతున్నారని, వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి ఒక సీటు వస్తుందని జగన్ రెడ్డి ఆవేశంగా మాట్లాడారని, ప్రజలు జగన్ రెడ్డికి 11 సీట్లు కి పరిమితం చేసిన బుద్ధి తెచ్చుకోకుండా అవాకులు చవాకులు మాట్లాడుతున్నారని, గెలిచిన 11 మందిలో జగన్ రెడ్డి ఒకరే మిగిలారని, మిగిలిన పదిమంది జగన్ కి అందనంత దూరం ఉన్నారని, అతను కోరుకున్నది ఇప్పుడే వచ్చేసిందని వెంకటరావు వ్యంగ్యంగా మాట్లాడారు. పకృతి వైపరీత్యం జరిగి ప్రజలు అల్లాడుతుంటే వారిని పరామర్శించకుండా, నేరస్తులను సమర్ధిస్తూ, జైలు యాత్రలు చేస్తూ, ఇతరులపై బురద జల్లడం జగన్ కి అలవాటుగా మారిందని, తానుంటే సంక్షేమ పథకాలు వస్తాయని, ఇప్పుడు పెన్షన్లు ఇంటింటికి అందడం లేదని చెప్పడం చూస్తుంటే కళ్ళుండి కబోది లాగా మాట్లాడుతున్నారని, కులాలు ప్రస్తావన తేవడం వారికి అన్యాయం చేస్తున్నారని చెప్పడం, తన ఐదు సంవత్సరాలు కాలంలో బీసీలు ఎస్సీలు, మైనార్టీలపై ఎన్ని కేసులు పెట్టారో పోలీస్ రికార్డులు స్పష్టం చేస్తాయని, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలను 300 మందిని అన్యాయంగా చంపేశారని, 36,000 మందికి పైగా అక్రమ కేసులు పెట్టారని, ఇవన్నీ మర్చిపోయి జగన్ రెడ్డి నీతి కబుర్లు మాట్లాడుతున్నారని తాను ఏది మాట్లాడినా ప్రజలు నమ్ముతారని ఇంకా అనుకుంటున్నారని, నేను మరలా ముఖ్యమంత్రిగా వస్తానని అందరి పైన కేసులు నమోదు చేసి జైలుకు పంపుతానని హెచ్చరించడం చూస్తుంటే జగన్ మానసిక పరిస్థితి బాగో లేనట్లుగా కనపడుతుందని, ఊహల్లో యలహంక ప్యాలెస్ కలలు కంటున్నారని, మహామేత రాజశేఖర్ రెడ్డి ప్రోత్సాహంతో 46 వేల కోట్లు అవినీతి అక్రమాలకు పాల్పడి, లక్ష ఎకరాలు భూములు దోచుకుని, ప్రజాధనంతో విమానాలు హెలికాప్టర్లు, తన సొంత ఇంటికి, తన కేసులకి ప్రభుత్వ ధనాన్ని విచ్చలవిధిగా ఖర్చుపెట్టి జల్సాలు చేశారని వెంకటరావు జగన్ రెడ్డి పై మండిపడ్డారు. ఇకనైనా బుద్ధి తెచ్చుకొని వరద బాధితులకు చేతనైతే సహాయం చేయాలని లేకపోతే తాడేపల్లి ప్యాలెస్ లో నాకు అధికారం వచ్చింది అని కలలు కనాలని వెంకటరావు ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత జిల్లా అధికార ప్రతినిధి బొడ్డేడ మురళి వాణిజ్య విభాగ జిల్లా అధికార ప్రతినిధి కర్రి మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# జపాన్ భాష పై ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ

## జపాన్ ఆస్పత్రుల్లో ఉద్యోగ అవకాశాలు



**పార్వతీపురం, (విశాఖ సమాచారమ్):** జపాన్ బాష నేర్చుకొని జపాన్ దేశంలో వైద్య రంగంలో విస్తృత ఉద్యోగావకాశాలు పొందవచ్చునని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి యు. సాయి కుమార్ తెలిపారు. గురువారం ఒక ప్రకటన విడుదల చేస్తూ ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, నావిస్ హెచ్ ఆర్ ఆధ్వర్యంలో ఏఎన్ఎం/జీఎన్ఎం/బీఎస్సీ-నర్సింగ్ చదివిన వారికి జపనీస్ భాషను ఎన్-5, ఎన్-4, ఎన్-3 స్థాయిల్లో నేర్పించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. జపాన్ భాష నేర్చుకున్న వారికి జపాన్ లోని ఆస్పత్రుల్లో వర్కర్స్ ఇన్ హాస్పిటల్స్/కేర్ హెరీమ్ ఫెసిలిటీగా ఉద్యోగావకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. జపాన్ లో పని చేసేందుకు ఆసక్తి కలిగి, 32ఏళ్లలోపు వయసున్న వారంతా అర్హులేనని, తొలుత జపనీస్ భాషలో రెసిడెన్షియల్ విధానంలో బెంగళూరులోని నావిస్ హెచ్ ఆర్ సంస్థ కార్యాలయంలో ఆర్నెళ్ల పాటు శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణ కాలంలో వసతి, భోజన సౌక ర్యాలుంటా యని, ఫీజు మాత్రం రూ.3.5లక్షలు (రిజిస్ట్రేషన్ ఫీజు రూ.50 వేలు, శిక్షణ ఫీజు రూ.3లక్షలు) చెల్లించాల్సి ఉంటుందన్నారు. రిజిస్ట్రేషన్ ఫీజు రూ.50వేలులో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ సగం భరిస్తుందని, మిగిలిన మొత్తాన్ని అభ్యర్థులే చెల్లించాలని, మిగిలిన రూ.3లక్షల్ని మూడు విడతలుగా చెల్లించొచ్చన్నారు. శిక్షణ ఫీజుకు నావిస్ హెచ్ ఆర్ సంస్థ రుణ సదుపాయం కల్పిస్తుందని, ఉద్యోగం వచ్చాక మూడు దఫాలుగా తిరిగి చెల్లించ వచ్చని తెలిపారు. జపాన్ లో నెలకు జీతం రూ.1.1లక్షల నుంచి రూ. 1.4లక్షల వరకు ఉంటుందని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఆ ప్రకటనలో స్పష్టం చేశారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు 9676965949 ఫోన్ నంబర్ ను సంప్రదించాలని తెలిపారు.

# విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి పాఠశాలల సమస్యలు తీసుకువెళ్లన ఎమ్మెల్యే విజయ్ చంద్ర



**పార్వతీపురం, (విశాఖ సమాచారమ్):** రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి విద్యారంగ సమస్యలను ఎమ్మెల్యే విజయ్ చంద్ర తీసుకువెళ్లారు పాఠశాలల పరిస్థితి వాటి అభివృద్ధికి తీసుకోవలసిన చర్యలను మంత్రి దృష్టిలో కి తీసుకువెళ్లినట్లు ఎమ్మెల్యే విజయ్ చంద్ర తెలిపారు. సవర భాష ప్రాంతాల్లో తెలుగు కూడా బోధించేందుకు ఉపాధ్యాయులను ఏర్పాటు చేయాలని మంత్రిని ఎమ్మెల్యే కోరారు. పురపాలక పాఠశాలలో పనిచేసిన ఉపాధ్యాయుల సమస్యలను మంత్రి దృష్టికి ఎమ్మెల్యే తీసుకువెళ్లారు. అలాగే గెస్ట్ లెక్చరర్ గా వచ్చి బోధించినప్పుడు టెట్ మినహాయింపు ఇవ్వాలని మంత్రిని కోరారు.సమస్యల పరిష్కారానికి మంత్రి సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే తెలిపారు. వరద ప్రాంతాల్లో పర్యటించి బాధితులకు అండగా నిలిచిన ఎమ్మెల్యేను మంత్రి అభినందించారు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించి బాధితుల కు ధైర్యం చెప్పి ప్రభుత్వం అండగా ఉందన్న నమ్మకాన్ని కలిగించినందుకు మంత్రి నారా లోకేష్ ఎమ్మెల్యేని అభినందించారు.

# శ్రీ మోదమాంబ హై స్కూల్ విద్యార్థులు - రూ.1 లక్ష విరాళం



**పాడేరు:** స్థానిక శ్రీ మోదమాంబ హై స్కూల్ విద్యార్థులు ముఖ్యమంత్రి సహాయ నిధికి రు.1 లక్ష 5 రూపాయల విరాళాన్ని అందజేశారు. గురువారం కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ ను కలిసి విద్యార్థులు సేకరించిన లక్ష రూపాయల నగదును జిల్లా కలెక్టర్ ఏ.ఎస్ దినేష్ కుమార్ కు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# బేగి ఎలిపొచ్చి...!

సాహిత్యం... సంగీతం... విజయనగరం! ఈ మూడింటిని వేర్వేరుగా చూడలేం. ఒకరా ఇద్దరా... గురజాడ, గణపతిముని, ఆదిభట్ల, వంగపండు... ఎందరెందరు కవులు, కళాకారులు! ద్వారం, ఘంటసాల, సాలూరి, సుశీల... మరెందరెందరు సుస్వరాల సమ్రాట్టులు! ఇక అక్కడి సంస్థానాలు... జానపదుల నోళ్లలో నానే వాటి వీరగాథలు... అన్నీ అబ్బురమే! ఇంతటి ఘనచరిత్ర ఉన్న ఆ నేలమాట ఇంకా ప్రత్యేకమైంది. పలుకుల కలకూజితాలతో తనదైన తెలుగు తియ్యందనాన్ని పంచే ఆ జిల్లా అమ్మభాషా విశేషాలు మీకోసం...!

తెలుగునాడుకు ఉత్తర సరిహద్దులో, తూర్పుతీరపు అంచున... అటు ఒడిశా, ఇటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు వారధిలా ఉంటుంది విజయనగరం జిల్లా. అనేక భాషల సంగమం ఈ ప్రాంతం. నాగరిక, జానపద సంస్కృతులు దోబూచులాడుతుంటాయి. శాతవాహనుల పాలనలో 'మధ్యపరగణాలు'గా వ్యవహారంలో ఉందీ ప్రాంతం. తర్వాత కళింగులు, గజపతులు, వెలమరాజులు ఇలా క్రమంగా విజయనగర గజపతుల చేతుల్లోకి వచ్చింది. స్వాతంత్ర్యానంతరం శ్రీకాకుళం, విశాఖపట్నం జిల్లాల్లోని కొన్ని భాగాలను విడదీసి 1979లో విజయనగరం జిల్లాను ఏర్పాటుచేశారు.

జిల్లా ఉత్తర, పశ్చిమ ప్రాంతమంతా పర్వతమయం. గిరిజనులు ఎక్కువగా ఉంటారు. దీనికితోడు నేడు ఒడిశాలో అంతర్భాగంగా ఉన్న గంజాం ప్రాంతం వరకు ఉమ్మడి మద్రాసు రాష్ట్ర ఏలుబడిలో కొన్నాళ్లుంది. ఇలా... తెలుగు, తమిళ, ఒడియా సంస్కృతులతో పాటు హిందీభాషా ప్రభావమూ ఈ ప్రాంతపు తెలుగు మీద బలంగానే ఉంది. భౌగోళికంగా అంతగా సంబంధం లేని హిందీ ఇక్కడికి ఎలా వచ్చిందంటే... ఒకప్పటి మధ్యప్రదేశ్, నేటి ఛత్తీస్గఢ్లోని రాయ్పుర్, జగదల్పుర్ తదితర ప్రాంతాల ప్రజలు వ్యాపారం నిమిత్తం ఈ ప్రాంతానికి రాకపోకలు సాగించడం వల్ల. మొత్తమ్మీద విజయనగరం తెలుగు ఇన్ని భాషల కలగలుపు. ఉదాహరణకు 'తన నివాసాన్ని మార్చుకున్నాడు' అనే అర్థంలో 'బిచాణా ఎత్తేశాడు' అంటారు. 'బిచాణా' అనేది ఒడియా పదం. అలాగే 'వేగం' అనే పదానికి గ్రామ్యరూపం 'బేగి'. ఈ పద రూపాంతరం మీదా ఒడియా ప్రభావం ఉంది. ఆ భాషీయులు 'వ' అక్షరాన్ని పలకరు. దాని బదులు 'బ' వాడతారు. వాళ్ల సాపత్యంతో 'వేగిరం' అనే ఉచ్చారణ కాస్తా 'బేగిరం'గా మారింది. కాలక్రమేణా 'బేగి'గా స్థిరపడిపోయింది.

**భలే భలే మాటలు**

వివిధ భాషల సంపర్కంతో తయారైన 'తెలుగు మాటలు' ఇక్కడ కొల్లలు. 'మేనత్త'ను స్థానికులు 'బాప్ప' అంటారు. హిందీ 'బాప్' (నాన్న)కి, తెలుగు 'అప్ప' (అక్క) కలిసి 'నాన్నకి అక్క'... 'బాప్ప' అయిందన్న మాట. ఎవరైనా నేరాన్ని కప్పిపుచ్చితే 'కామప్ చేసేశారు' అంటారు. ఆంగ్లంలోని 'క్లెయిమ్ అప్' (దాచేయడం) దీనికి మూలం. ఎవరైనా అబద్ధాలు చెబుతోంటే, 'వాడివన్నీ జూటా మాటలు' అనేస్తారు. 'ఝూటా' అంటే హిందీలో అబద్ధం. ఇక 'పొడవు'నేమో 'జబరు' అని పిలుచుకుంటారు. ఇది ఉర్దూ మాట. ఆ భాషలో దీనికి అర్థం 'ఉన్నతమైన' అని. 'ఉష్ణం' (వేడి) అనే సంస్కృత పదం 'ఊష్టం'గా మారి విజయనగరం తెలుగులో జ్వరానికి మారుపేరైంది. అలాగే ఉక్కపోతని 'ఈష్ట' అంటారు. ఇదీ 'ఉష్ణం' రూపాంతరమే. ఇలా సంస్కృతం నుంచి వచ్చిన మరో మాట 'జిమ్మ'. అంటే... నాలుక. 'జిహ్వ' దీనికి మూలం. 'బైఠాయించు' అంటే పత్రికా భాష అనుకుంటాం కానీ, 'కూర్చోవడం' అనే అర్థంలో స్థానికులు దీన్ని సాధారణంగానే వాడేస్తుంటారు. వీటన్నింటికీ మించి ఆశ్చర్యాన్ని కలిగించే మాట 'ఎప్పెస్'. విజయనగరం భాషలో దానికి అర్థం 'ఉచితం'. ఆంగ్ల 'ఫ్రీ సర్వీస్'లోని ఎఫ్, ఎస్ అక్షరాల గ్రామ్య కలగలుపు ఇది! ఈ జిల్లా భాషని తరచిచూస్తే ఇలాంటి మాటలు చాలానే కనిపిస్తాయి.

ఇక్కడి ఊళ్ల పేర్లు కూడా ఆసక్తిదాయకంగా ఉంటాయి. చుట్టూ పర్వతాలు ఉన్న ఊరు మొదట 'పర్వతపురం' అయింది. కాలక్రమంలో అది పార్వతీపురంగా మారింది. భేల్- ఎలుగుబంటి, గాఁవ్- గ్రామం.... ఎలుగుబంట్లు ఎక్కువగా సంచరించే గ్రామం 'భేల్గాఁవ్' అయింది. క్రమేపీ అది 'బెలగాం'గా మారింది. నిడువైన కల్లు(కొండ) ఉన్న ఊరు 'నిడువుకల్లు'గా వ్యవహారంలోకి వచ్చి 'నిడగల్లు'గా రూపాంతరం చెందింది. ముళ్లపొదలు ఎక్కువగా ఉన్న పల్లె 'కంటకాపల్లి' అయింది. తాటిచెట్లు ఎక్కువగా ఉండే ప్రాంతమే 'తాడివాడ'. కోనేం రకపు చేపలు ఎక్కువగా అమ్ముడయ్యే సముద్రతీర గ్రామమే కోనవాడ.. అదే కోనాడ. ఇలా ప్రతి ఊరిపేరు వెనకా ఓ విశేషం కనిపిస్తుంది.

**వాళ్లది ప్రత్యేకం**

నాగావళి, వేగావతి, సువర్ణముఖి, చంపావతి, గోస్తని, జంఝావతి తదితర నదులు ప్రవహిస్తున్నప్పటికీ ఈ ప్రాంత వ్యవసాయం ఎక్కువగా వర్షాధారమే. అయినప్పటికీ ఆహార, వాణిజ్య పంటలకి అనువైన ప్రదేశం. 'అయ్యకి ఆస్తి లేదు, గర్వమూ లేదు' అన్న చందాన ఉంటుందీ ప్రాంత ఫలసాయం. తిండికి లోటుండదు. అలాగని అమ్ముకుని సొమ్ము చేసుకుందామంటే చాలదు. అలాంటి ఈ ప్రాంతానికి గోదావరి సీమనుంచి కొన్ని ద్రావిడ బ్రాహ్మణ కుటుంబాలు వలస వచ్చాయి. అగ్రహారాలను ఏర్పాటు చేసుకున్నాయి. తమిళనాడుకు చెందిన ఈ శాఖీయులు మొదట గోదావరీ పరీవాహక ప్రాంతంలో స్థిరపడ్డారు. గోదావరి నదిమీద ఆనకట్ట లేని సమయంలో ప్రబలిన కరవుకు తట్టుకోలేక, వాళ్లలో కొందరు ఈ ప్రాంతానికి వచ్చారన్నది చరిత్ర కథనం. కృష్ణరాయపురం ('కన్యాశుల్కం'లో దీని ప్రసక్తి ఉంది), అజ్జాడ (హరికథా పితామహుడు ఆదిభట్ల నారాయణదాసు స్వస్థలం), కలవరాయి, లోగిశ (కావ్యకంఠ గణపతిముని పుట్టిన ఊరు), సుంకి, చాకరాపల్లి, చల్లపేట... ఇవన్నీ ద్రావిడ బ్రాహ్మణ అగ్రహారాలు. వీటితోపాటు వెలనాటి బ్రాహ్మణుల అగ్రహారాలు- వెంగాపురం, కుసుమూరు, నందబలగ, శివరాంపురం మొదలైనవి కొన్ని ఉన్నాయి. ఈ రెండు రకాలైన అగ్రహారాలనీ కలిపి 'నందాపురం పట్టీ' పేరుతో పిలుస్తారు. ఈ ఆగ్రహారికుల మాటతీరు ఒకలా ఉంటుంది. వీళ్ల దగ్గర వివిధ వృత్తుల్లో కుదురుకున్న ఇతరుల మాటతీరు మరోలా ఉంటుంది. కాలక్రమంలో అగ్రహారాలు పోయినా, ఆ రెండు వర్గాల భాషలో మాత్రం ఆ తేడాలు కనిపిస్తూనే ఉంటాయి.

ఎక్కువ అనే పదానికి అగ్రహారపు పలుకుబడి 'లావు'. దాన్నే ఇతర గ్రామీణులేమో 'వింత' అంటారు. కొంచెం- కాస్త (అ.ప), కసింత (గ్రా) ఇటువైపు- ఇసుంటా (అ.ప), ఇటింకా (గ్రా) వచ్చేసెయ్- ఒచ్చీ, వళపచ్చీ (అ.ప), ఎలిపొచ్చీ (గ్రా)గోళీలు- గొట్టికాయలు (అ.ప), అల్లికాయలు (గ్రా)తొందరగా- వేరంగా (అ.ప), బేగి (గ్రా) అత్యాశ- కాప్యానం, కాపీనం (అ.ప), కాపేనం (గ్రా) సంతృప్తి చెందు- ఆటిపారు (అ.ప), గీటెక్కు (గ్రా) వేళాకోళం- సరసాలు (అ.ప), ఇగటాలు (గ్రా)... ఇలా ఒకే ప్రాంతంలో రెండు రకాల మాటలు వినపడుతుంటాయి.

**అక్కడ అలా... ఇక్కడ ఇలా!**

సాగతీతగానీ, తెగవేతగానీ లేకుండా పూర్తి పదాన్ని ఉచ్చరించడం ఈ జిల్లా ప్రత్యేకత. అంతేకాదు పదోచ్చారణ స్పష్టంగా ఉంటుంది. గ్రామీణభాషలో 'ము' వర్ణకాంత ప్రయోగాలు ఎక్కువ. ఉదాహరణకు 'చేద్దాము'- సేతుము చూద్దాము- సూతము విందాము- విందము, ఉందాము- ఉందుము లాంటివి. ఇక ఒకే జిల్లా అయినప్పటికీ, కొన్ని మాటల్లో విజయనగరం ప్రాంత గ్రామ్యానికి, పార్వతీపురం ప్రాంత గ్రామ్యానికీ స్పష్టమైన తేడా కనిపిస్తుంది. దీనికి కారణం నాడు విజయనగరం తెలుగు రాజుల పాలనలో ఉంటే, పార్వతీపురం కళింగ రాజుల ఏలుబడిలో ఉండేది. దీంతో ఆయా భాషల ప్రభావం స్థానికుల మాటల మీద పడింది.

పశువులను పార్వతీపురం ప్రాంతంలో 'సొమ్ములు' అంటారు. అదే విజయనగరం వాళ్లయితే 'పసరాలు' అని పిలుస్తారు. అమ్మాయి, అబ్బాయిలను పార్వతీపురం వాళ్లు 'గుంట', 'గుంటడు'గా వ్యవహరిస్తారు. విజయనగరం ప్రాంతవాసులేమో 'పిల్ల', 'పిల్లడు'గానే ఉచ్చరిస్తారు. అలాగే... గోతులు- గుమ్ములు (పా), గాతలు (వి) నేను- నాను (పా), నీను (వి) ఉంచడం- ఇడ్డం (పా), ఎట్టడం (వి)పలకకుండా- పల్లక (పా), ఒల్లక (వి) కారం- నొర్ర (పా), వర్ర (వి)... లాంటి భేదాలెన్నో కనిపిస్తాయి. ఈ పదాలన్నీ విజయనగరం తెలుగుకు ఓ ప్రత్యేకతను సమకూర్చాయి.

ఒకే పదానికి రెండు మూడు అర్థాలున్న పదాలూ ఉన్నాయి ఇక్కడ. గుంట- ఆడపిల్ల, రోలు గూద- తిండియావ, కడుపు కొర్రు- ఏ పనికైనా అడ్డుపుల్ల వేయడం, మేకు, కొండశిఖరంపెడ- అరటి అత్తం, ఒకపక్క జెల్ల- ఓ రకం చేప, లెంపకాయ కొత్తెం- అరటిపువ్వు చివరి భాగం, తలవెనక భాగంలో కొట్టే చిన్నదెబ్బ... ఇలాంటివి ఎన్నో! ఎన్నెన్నో!! అలాగే, పంచదారను 'చీనీ' అని, ముల్లంగిని 'సొత్తికూర' అని పిలుస్తారు.

**అందరిదీ అదే బాట**

ఈ ప్రాంతంలో పండితులు చాలామందే ప్రవర్ధిల్లారు. సంప్రదాయ సాహిత్యం నుంచి కాల్పనిక సాహిత్యం వరకూ అన్ని రకాల ప్రక్రియలకీ ఆలవాలమైంది ఈ నేల. ఎన్ని రకాల సాహితీ ప్రక్రియలు వెలువడినా, ఈ ప్రాంత భాషకి ప్రాధాన్యమివ్వడం మరవలేదు ఏ సాహిత్యకారుడున్నూ. ఆదిభట్ల అయితే 'సీమపలుకు వహి' అనే పేరుతో అచ్చతెలుగు మాటలకూర్పుతో ఓ నిఘంటువునే రూపొందించారు. అందులో కనిపించే విజయనగరం మాటల్లో కొన్ని... అచ్చిక బుచ్చిక (కలుపుగోలుతనం), ఆరిగం (మట్టి కుంపటి), ఇమ్ము (పదిలం), ఈంద్రపడు (మొరాయించు), ఉరిడి (కుమ్మరిపురుగు), ఆసడ్డ (నిర్లక్ష్యం). ఇక గురజాడ అయితే 'కన్యాశుల్కం' సంభాషణల రూపంలో విజయనగరం తెలుగుకు చెరగని ఖ్యాతిని తెచ్చిపెట్టారు.

ఈ ప్రాంతంలో ప్రజాసాహిత్యమూ ప్రబలంగానే వచ్చింది. దానికి కారణం రైతాంగ సాయుధ పోరాటానికి నెలవుకావడమే. ఆ ఉద్యమాన్ని స్ఫూర్తిగా తీసుకుని భూషణం, వంగపండు తదితరులు ప్రజలభాషలో రచనలు చేశారు. వాళ్ల పాటల్లో వినిపించే ఈ ప్రాంత గ్రామ్య పదాలు కొన్ని... పొవ్వాకు (పొగాకు), టకురు (ముదురు), ఉమ్మిరి (ముమ్మరం), ఎక్కిడి తొక్కిడి (పుష్కలం), ఎమకల (తెల్లవారుజామున), కవుకులు (ఇబ్బందులు), ఒగ్గేసి (వదిలేసి). గ్రామీణుల మాటల్లో దొర్లే ఇలాంటి పదాలకు సాహితీ పట్టం కట్టిన కవులు ఇక్కడ చాలామందే ఉన్నారు.

ఖఇలా ప్రాచీనకాలం నుంచి నేటివరకూ అనేక రూపాంతరాలు చెందుతూ... అటు పండితులను, ఇటు జానపదులను ఒకే బాటలో నడుపుతూ... తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని నిలబెట్టుకుంది విజయనగరం తెలుగు. ఎన్ని ఒడుదొడుకులు వచ్చినా తన మట్టిమాటలకే తొలి ప్రాధాన్యమిచ్చే ప్రాంతమిది...

# నీట మునిగిన పంట పొలాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్






**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** ఇటీవల జిల్లాలో కురిసిన భారీ వర్షాల కారణంగా అనకాపల్లి మండలం శంకరం గ్రామం లో నీట మునిగిన పంట పొలాలను బుధవారం జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ పరిశీలించారు. ఈ సందర్భంగా పంట నష్టపోయిన రైతులతో మాట్లాడారు. పంట వివరాలను, జరిగిన నష్టం గురుంచి అడిగి తెలుసుకున్నారు. అవఖండంలోకి నీరు పోయే అవకాశం లేకపోవటం కారణంగానే పొలాలు నీట మునిగిపోయాయని రైతులు కలెక్టర్ కు తెలియజేస్తూ వారి ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఇలా జరగకుండా తగు చర్యలు తీసుకోవాలని రైతులు వారి సమస్యలు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.

ఈ కార్యక్రమం లో జెడి అగ్రికల్చర్ మోహనరావు, స్థానిక నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# విజయవాడలో శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ చేపట్టిన వరద సహాయక చర్యలను ప్రశంసించిన చంద్రబాబు



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె రత్నాకర్, శ్రీ సత్యసాయి సేవా సంస్థల ఇతర సభ్యులతో కలిసి గౌరవనీయులైన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబు నాయుడు మరియు ఎన్. లోకేష్, గౌరవనీయులైన మానవ వనరుల అభివృద్ధి మంత్రి ఐటి, ఎలక్ట్రానిక్స్ & కమ్యూనికేషన్ మరియు రియల్ టైమ్ గవర్నెన్స్ (ఆర్‌టీజీ), ఏపీ ప్రభుత్వంను కలిశారు.

ఈ సమావేశంలో విజయవాడలో శ్రీ సత్య సాయి సెంట్రల్ ట్రస్ట్ చేపడుతున్న విస్తృత వరద సహాయ కార్యక్రమాల గురించి గౌరవ ఎన్ చంద్రబాబు నాయుడు మరియు గౌరవ ఎన్ లోకేష్‌కు శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ (ఎస్ఎస్ఎస్‌సిటి) మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె రత్నాకర్ వివరించారు.

శ్రీ సత్య సాయి సెంట్రల్ ట్రస్ట్ చేస్తున్న సహాయ కార్యక్రమాలను మరియు శ్రీ సత్యసాయి సేవా సంస్థల సేవాదళ్ సభ్యులు చేసిన అద్భుతమైన సేవను ఇరువురు నాయకులు ఎన్ చంద్రబాబు నాయుడు గారు మరియు గౌరవ ఎన్ లోకేష్ అభినందించారు.

సహాయక చర్యల్లో భాగంగా, 100 ట్రక్కుల రిలీఫ్ మెటీరియల్‌లను లబ్ధిదారులకు శ్రీ సత్య సాయి సెంట్రల్ ట్రస్ట్ ద్వారా నేరుగా వారి ఇంటి వద్దకే పంపిణీ చేయడం ద్వారా సహాయం అవసరమైన వారికి సమర్థవంతంగా మరియు ప్రభావవంతంగా చేరేలా చర్యలు తీసుకోబడ్డాయి.

భగవాన్ శ్రీ సత్యసాయి బాబా వారి నిస్వార్థ సేవా స్ఫూర్తితో ప్రేరణ కలిగి శ్రీ సత్యసాయి సేవా సంస్థలకు చెందిన 600 మందికి పైగా అంకితభావంతో సేవాదళ్ సభ్యులు ఈ ఉదాత్తమైన సేవలో పాల్గొన్నారు.

శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మానవాళి సేవకు కట్టుబడి ఉంది, శ్రీ సత్య సాయి సేవా సంస్థల సేవాదళ్ /వాలంటీర్లు ప్రతి సేవా కార్యకలాపంలో ఎల్లప్పుడూ ముందంజలో ఉంటారు, ఎలాంటి పరిస్థితిలోనైనా ప్రతిస్పందించడానికి ఏళ్ళ వేళలా సిద్ధంగా ఉంటారు. వరదల వల్ల కష్టాల్లో ఉన్న వారందరికీ త్వరగా ఉపశమనం మరియు తగిన శక్తిని ప్రసాదించమని శ్రీ సత్య సాయి సేవా సంస్థలు/శ్రీ సత్య సాయి సెంట్రల్ ట్రస్ట్ ప్రార్థిస్తూనే ఉంటాయి.

# ప్రతిష్టాత్మక డా. యలవర్తి నాయుడమ్మ స్మారక పురస్కారాన్ని అందుకున్న ప్రసన్న కుమార్ మోటుపల్లి, సీఎండీ, ఎన్ఎల్‌సి ఇండియా లిమిటెడ్



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ప్రసన్న కుమార్ మోటుపల్లి, ఎన్ఎల్‌సి ఇండియా ఛైర్మన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్ లిమిటెడ్, బొగ్గు మంత్రిత్వ శాఖ పరిధిలోని నవరత్న కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ, భారత ప్రభుత్వం, ప్రతిష్టాత్మక డా. యలవర్తి నాయుడమ్మతో సత్కరించింది.

ఆంధ్రప్రదేశ్‌లోని తెనాలిలో ఘనంగా జరిగిన కార్యక్రమంలో స్మారక పురస్కారం 2024. నాదేండ్ల మనోహర్, పౌరసరఫరాల మంత్రి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రముఖుల జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన ఈ ప్రతిష్టాత్మకమైన నాయుడమ్మ అవార్డును అందజేశారు.

శాస్త్రవేత్త మరియు సిఎస్ఐఆర్ మాజీ డైరెక్టర్ జనరల్, డాక్టర్ యలవర్తి నాయుడమ్మ, కు ప్రసన్న కుమార్ మోటుపల్లి సమక్షంలో యడ్లపాటి రఘునాథ్, డా. యలవర్తి నాయుడమ్మ సైన్స్ అండ్ టెక్నాలజీ ఫౌండేషన్ చైర్మన్ మరియు కోటా సుబ్రమణ్యం, ఉపాధ్యక్షుడు మరియు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

డాక్టర్ వై.నాయుడమ్మ మెమోరియల్ అవార్డు, 1986లో స్థాపించబడింది, ఇది లెదర్ టెక్నాలజీ రంగంలో విశేష కృషి చేసిన ప్రముఖ శాస్త్రవేత్త మరియు సాంకేతిక నిపుణురాలు డాక్టర్ యెలవర్తి నాయుడమ్మ జ్ఞాపకార్థం మరియు వారసత్వాన్ని స్మరించుకోవడానికి తెనాలి ఫౌండేషన్ స్థాపించిన ప్రతిష్టాత్మక గౌరవం. భారతదేశంలో మోడెమ్ శాస్త్రీయ పరిశోధనను రూపొందించడంలో అతని పాత్ర కోసం. ఈ అవార్డు డా. నాయుడమ్మ తన విశిష్టమైన కెరీర్‌లో సమర్థించిన విలువలు మరియు దృక్పథాన్ని ప్రతిబింబిస్తూ శాస్త్ర, సాంకేతిక, మరియు సామాజిక అభివృద్ధి రంగాలలో ఆదర్శప్రాయమైన కృషి చేసిన విశిష్ట వ్యక్తులను గుర్తిస్తుంది.

ఈ సందర్భంగా ప్రసన్నకుమార్ మోటుపల్లి మాట్లాడుతూ డా.వై.నాయుడమ్మ స్ఫూర్తిదాయకమైన జీవితాన్ని గుర్తుచేసుకుంటూ నాయుడమ్మ ట్రస్టుకు ప్రతిష్టాత్మకమైన అవార్డును ప్రదానం చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. శాస్త్ర సాంకేతిక రంగంలో డాక్టర్ యలవర్తి నాయుడమ్మ చేసిన కృషిని, ఆయన చేసిన సామాజిక మార్పును కూడా ఆయన గుర్తు చేసుకున్నారు. వాతావరణ మార్పు మరియు ఇంధన భద్రత అనే ద్వంద్వ సవాళ్లను దేశం ఎదుర్కొంటున్నందున, మరింత స్థిరమైన మరియు స్థితిస్థాపక ఇంధన భవిష్యత్తుకు పరివర్తనను ప్రారంభించే ఆవిష్కరణపై మోటుపల్లి ఉద్ఘాటించారు. సాంకేతికతలో పురోగతి మరియు పునరుత్పాదక ఇంధన వనరుల వైపు ఒక నమూనా మార్పుతో పాటు వాతావరణ మార్పులను పరిష్కరించాల్సిన అవసరాన్ని ఆయన హైలైట్ చేశారు. ఎనర్జీ స్టోరేజ్ టెక్నాలజీస్ యొక్క ప్రాముఖ్యతను అతను నొక్కి చెప్పాడు.

పునరుత్పాదక ఇంధన సామర్థ్యం జోడింపుతో గ్రిడ్‌లో సరఫరా మరియు డిమాండ్‌ను సమతుల్యం చేయడానికి భారత విద్యుత్ రంగం. కఠినమైన డీవియేషన్ సెటిల్‌మెంట్ మెకానిజంతో ఆర్‌ఈ పవర్‌ని అంచనా వేయడానికి & షెడ్యూల్ చేయడానికి తెలివిగా, మరింత సమర్థవంతంగా మరియు మరింత విశ్వసనీయమైన శక్తి వ్యవస్థలను ప్రారంభించడం ద్వారా విద్యుత్ రంగంలో విప్లవాత్మక మార్పులు చేయగల సామర్థ్యాన్ని కలిగి ఉన్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పాత్రను అతను నొక్కి చెప్పాడు. దేశంలోని శక్తి రంగం, స్థిరత్వాన్ని శక్తివంతం చేయడంలో 1 జిడబ్ల్యూ పునరుత్పాదక సామర్థ్యాన్ని చేరుకున్న మొదటి సిపిఎస్‌యు అయిన ఎన్ఎల్‌సి ఇండియా పాత్రను ఆయన వివరించారు.

ఈ సందర్భంగా ప్రసన్న కుమార్ మోటుపల్లి తన కెరీర్ మరియు జీవితాన్ని రూపొందించడంలో కీలకమైన తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యులు మరియు శ్రేయోభిలాషులకు ధన్యవాదాలు తెలిపారు.

ప్రసన్న కుమార్ మోటుపల్లి గతంలో నాయుడమ్మ అవార్డు గ్రహీతలైన డాక్టర్ ఎం. ఎస్. స్వామినాథన్, డా. వర్గీస్ కురియన్, డా. కస్తూరి రంగన్, డా. ఆర్.కె. మషేల్కర్, డా. ఆర్. చిదంబరం, డా. వాసుదేవ్ కె. ఆత్రే, డా. జి. మాధవన్ వంటి ఎలైట్ క్లబ్‌లో చేరారు. నాయర్, డాక్టర్ శ్యామ్ పిట్రోడా, డాక్టర్ ఎ. శివథాను పిళ్లై, వి.కె.సరస్వత్, డా.వి.శాంత, ప్రొ.నార్లికర్ తదితరులున్నారు.

# వరద భాదితుల సహాయార్థం విశాఖ ప్రజల సహాయం అభినందనీయం



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** విజయవాడ వరద భాదితుల సహాయార్థం విశాఖ ప్రజలు ఎప్పటిలాగానే ముందుకొచ్చి సాయం చేయడం అభినందనీయమని 35 వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కర రావు పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం డబాగార్డెన్స్ విజేఎఫ్ ప్రెస్ క్లబ్ లో మీడియా సమావేశంలో ఆయన వివరాలు చెప్పారు. ఆయన వరద బాధితుల కోసం సేకరించిన హుండీలు తాళం తీశారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ , ఆపన్న హస్తం అందించడంలో విశాఖ ఎప్పుడూ ముందు వుంటుందన్నారు. ప్రజలు విరాళాలు, పాత దుస్తులు, ఆహారం, మంచి నీరు బాధితులకు అందజేశారని గుర్తు చేశారు. తమ వార్డుకి చెందిన యూత్ బాయ్స్ విరాళాలు సేకరించడం అభినంద నీయమన్నారు. ఈ సందర్భంగా టీమ్ సభ్యులను కార్పొరేటర్ అభినందించారు. తమ టీమ్ సాయంతో మంచి పని తలపట్టి డొనేషన్స్ కలెక్షన్ చేశామని విశాఖ సిటీ వైడ్ సోనూ సూద్ సంస్థ అద్యక్షుడు, 35 వార్డు పండా వీధి, ప్రసాద్ గార్డెన్స్ యూత్ బాయ్స్ ప్రతినిధి డోల జగదీష్ వెల్లడించారు. ఈ కార్యక్రమం ద్వారా వచ్చిన అమౌంట్ ను మీడియా మిత్రుల సమక్షంలో తెరిచి లెక్కించి మీడియాకు తెలిపారు. దక్షిణ నియోజక వర్గంలో గల జగదాంబ, పూర్ణా మార్కెట్ తదితర ప్రాంతాల్లో ప్రజలు నుంచి విరాళాలు సేకరించి ప్రభుత్వానికి అందజేస్తా మన్నారు. హుదూద్ తుపాన్ లో తాము కూడా ఇబ్బందులు పడ్డామని గుర్తు చేశారు. విజయవాడ వరదలు చూసి చాలా బాధ పడ్డామన్నారు. మూడు రోజుల పాటు విశాఖ దక్షిణంలో 16 మంది సభ్యులు ద్వారా సేకరించామని తెలిపారు. విరాళాలు సేకరణలో సహకరించిన సభ్యులకు కార్పొరేటర్ భాస్కర రావు చేతుల మీదుగా చిరు కానుకలు అందజేశారు.

సోనూ సూద్ పుట్టిన రోజు వేడుకలు సందర్భంగా ప్రజలకు బియ్యం వంటి నిత్యావసరాల పంపిణీ వంటి సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు.

మీడియా సమావేశంలో యూత్ బాయ్స్ , సోనూ సూద్ వైజాగ్ సిటీ వైడ్ సంస్థ సభ్యులు బాలు, మురళీ, అప్పారావు, హేమంత్, రాజు, సాయి, సీడిలిప్, లలిత, వంశీ, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.




# రైతులతో సంఘాలు ఏర్పాటు చేయండి



**పాడేరు:** రైతులతో స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్ పేర్కొన్నారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు ప్రభుత్వం నుండి అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామన్నారు. నాబార్డు ఆధ్వర్యంలో రైతు ఉత్పత్తి దారులు గ్రూపులతో కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం ఏర్పాటు చేసిన సమాశానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యానవన శాఖ, వ్యవసాయ శాఖల ఆధ్వర్యంలో రైతు స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేయాలని చెప్పారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాలు బలోపేత మవ్వాలని చెప్పారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాల సమస్యలను పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాలు అభివృద్ధి చెందాలని పేర్కొన్నారు. ప్రకృతి సంపదను పరిరక్షించాలని అన్నారు. గిరిజన ఆర్థిక పరిస్థితులు మెరుగు పడాల్సిన అవసరం ఉందన్నారు. సహజ సిద్ధమై చిరుధాన్యాలను సంరక్షాలను పేర్కొన్నారు. రైతులకు ఎరువులు వ్యవసాయానికి సాగుకు యంత్రపరికరాలు, ఉపకరణాలు అందించాలని సూచించారు. రైతులు దళారులను ఆశ్రయించడం వలన ఆదాయం తగ్గిపోతుందన్నారు. చెక్ డ్యాంల నిర్మాణాలు, మరమ్మతుల బాధ్యత ఎఫ్.పి. ఓలకు అప్పగిస్తామన్నారు. ఎఫ్పి ఓల సమస్యలు పరిష్కారానికి జిల్లా అధికారులతో కమిటీ ఏర్పాటు చేసి ప్రతీ నెలా సమావేశాలు నిర్వహిస్తామన్నారు.

నాబార్డు జిల్లా వికాస అధికారి రావూరి చక్రధర్ మాట్లాడుతూ జిల్లాలో 50 రైతు ఉత్పత్తిదారుల సంఘాలు ఉన్నాయని రైతు ఉత్పత్తిదారుల సంఘాలను ప్రోత్సహిస్తామన్నారు. రుణాలు అందించే విధంగా బ్యాంకర్లతో సమన్వయం చేస్తామన్నారు. అదే విధంగా గ్రాంటు సహకారం అందిస్తమన్నారు. విత్తన సంపదను కాపాడాలని సూచించారు. విత్తన తయారీ నర్సరీలపై దృష్టి పెట్టాలని చెప్పారు. కష్టమ్ హైరింగ్ సెంటర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. అరకు కాఫీ బ్రాండును వినియోగించుకోవడానికి రైతు ఉత్తిదారుల సంఘాలు కాఫీ బోర్డు దగ్గర ఆథరైజ్డ్ యూజర్ సర్టిఫికేట్ పొందాలని చెప్పారు. రైతు ఉత్పతిదారుల సంఘాలకు అవసరమైన శిక్షణలు, క్షేత్ర సందర్శనలకు తీసుకుని వెళతామని చెప్పారు.

ఈ సమావేశంలో జిల్లా ఉద్యాన వన అధికారి రమేష్ కుమార్ రావు, జిల్లా వ్యవసాయాధికారి ఎస్.బి. ఎస్ .నంద్, స్పైసెస్ బోర్డు సీనియర్ క్షేత్ర అధికారి బి. కల్యాణి, కాఫీ బోర్డు అధికారి పి.దుర్గా భవాని, పలువురు మండల ఉద్యానవన అధికారులు, గిరిజన వికాస్, స్మైల్, ఎస్.వి.డి.ఎస్, వికాస, మన్యతోరణం, సుసాగు చిరుధాన్యాల చెల్లెళ్లు సంఘం ప్రతినిధులు, పలువురు రైతులు తదితరులు పాల్గొన్నారు.

VISAKHA SAMACHARAM Telugu Daily. Edited, Printed, Published & Owned by : T.Sirisha , Printed at Suryodaya Publications, VisakhaSamacharam Press Door No. 9-3-16, Pitapuram Colony, Visakhapatnam-3. Editorial Office : 9393949345, 9346363839, 9160190123
Hyderabad (Sai Ganesh) : Cell : 9030841841, Kakinada (K.B. Ramarao): Cell: 9949413661, Parawada (satyanarayana): Cell: 77804 33919, Srikakulam : Cell: 70321 98574, Bheemili (D.V.Chalapathi Rao) : Cell: 9849603258, Office (Raghunath) : 7013785256. Arilova (D.Venkatesh) : 73825 85777. Maddilapalem (G.Raamakrishna) : 99084 24231, Yelamanchili (P.S.N. Murthy) : 83095 38789 Anakapalli (M.Krishna Rao) : 63023 75539
Paderu (P.Ravi Kumar) : 94908 12271 Parvathipuram (S.S.Naidu) : 94900 27519 Chintapalli (Srinivas) : 94923 40861 Chodavaram (BVR Murthy) : 81431 22188

గమనిక : ఇక్కడ ఇవ్వబడిన పేర్లు కలిగిన వారిని మాత్రమే విశాఖ సమాచారమ్ దినపత్రికకు విలేఖరులుగా గుర్తించవలెను. ఇక్కడ పేరు లేకుండా ఎవరైనా విశాఖ సమాచారమ్ ప్రతినిధిగా చెబితే నమ్మవద్దు.